



అరాచక పాలన నుంచి విముక్తికి నేటితో ఏడాది

● జగన్ జమానాలో అడ్డూ అదుపు లేని అక్రమాలు ● చిత్తుగా ఓడించిన ఓటర్లు

జగన్ పాలన అంతా భూకబ్జాలు.. సెటిల్‌మెంట్లు.. హత్యలు.. అక్రమ కేసులతోనే సరిపోయింది. సామన్య జనం ప్రశ్నిస్తే చాలు.. వారిపై ఏదోక కేసు నమోదు చేసేవారు. దీంతో జనంలో భయాందోళన కలిగేది. ఇక పాలనాపరంగా చూస్తే కరెంటు, ఆర్టీసీ చార్జీలు పెంచడం, చెత్త పన్ను ఇలా ఒకటేంటి అన్నింటి మీద బాదుడే బాదుడు వేశారు. బటన్ నొక్కుతున్నానని చెప్పి జనంపై మోయలేని భారం మోపారు. ఆ ఐదేళ్లు కోపాన్ని పంటి బిగువుపై పట్టిన ఓటర్లు ఒక్కసారిగా పోలింగ్ రోజున ఫ్యాను రెక్కలు విరిచేశారు. గతేడాది జూన్ 4న కూటమి ప్రభుత్వం విజయం సాధించడంతో అరాచక పాలన నుంచి ప్రజలకు విముక్తి కలిగింది.

(కడప-ఆంధ్రజ్యోతి): జగన్ హయాంలో జిల్లాలో నిత్యం ఏదోక చోట భూకబ్జాలు, సెటిల్‌మెంట్లు సాగుతుండేవి. రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకునే వారు కాదు. ప్రజాస్వామ్య పద్ధతిలో ఎవరైనా నిరసన తెలపాలన్నా 30 యాక్టు అమలులో ఉందంటూ అనుమతించేవారు కాదు. ఒకవేళ ఏదైనా ప్రభుత్వంపై విమర్శిస్తే ఏదోక కేసులో బొక్కలే వేయడమో, లేదంటే ఏకంగా లేపేయడమో ఇలా ఉండేది. గతేడాది జూన్ 4న నాటి వరకు తెల్లోడి పాలనలో జనం ఉన్నట్లుగా జగన్ జమానాలో అలాగే సాగిందని విమర్శలున్నాయి. సరిగ్గా నేటికి ఓటు అనే ఆయుధంతో జగన్ పాలన నుంచి జనం విముక్తి ప్రకటించుకున్నారు. ఉమ్మడి జిల్లాలో ఏడు సీట్లతో కూటమి ప్రభుత్వం విజయదుందుభి మోగించి జిల్లా రాజకీయ ముఖచిత్రాన్నే మార్చేసింది.

ఎడాపెడా బాదుడు



ఐదేళ్ల జగన్ హయాంలో తొమ్మిదిసార్లు కరెంటు చార్జీలు పెంచారు. సర్‌చార్జీలు, ట్రూఅప్ చార్జీలు అంటూ భారీగా పెంచేశారు. కరెంటు ముట్టుకుంటే కాదు కరెంటు బిల్లులు చూస్తే షాక్ కొట్టే విధంగా వచ్చేసింది. గతంలో 300, 400 వచ్చే కరెంటు బిల్లు ఒక్కసారిగా వెయ్యి, 1500కు పైగా భారీగా పెరిగింది. దీంతో సామాన్య, మధ్యతరగతి జనం నానా అవస్థలు పడ్డారు. జగన్ వేసిన భారాన్ని ఇంకా కరెంటు రూపంలో వచ్చే ఏడాది వరకు కూడా మోయాల్సిన దుస్థితి ఏర్పడింది. ఇక ఆస్తి పన్ను పెంచవద్దంటూ కార్పొరేషన్, కడప మున్సిపాలిటీల్లో పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపట్టారు. డోంట్ కేర్ అంటూ రిజిస్ట్రేషన్ భూమి విలువ ఆధారంగా పెంచేయడంతో ఒక్కసారిగా పన్నుల భారం బాగా పెరిగింది. దీంతో యజమానులు ఆ భారాన్ని అద్దెకు ఉంటున్న వారిపై మోపారు. ఇక చెత్త పన్ను వద్దు వద్దు అంటున్నా వేసి ముక్కుపిండి మరీ వసూలు చేశారు.

జేబ్రాండ్స్ మద్యం



ఉమ్మడి రాష్ట్రంలో ప్రైవేటు వ్యాపారుల ద్వారా మద్యం విక్రయాలు సాగుతుండేవి. దీంతో దేశంలో టాప్ బ్రాండ్లన్నీ దొరుకుతూ వచ్చేవి. అయితే జగన్ మద్యపానం నిషేధం పేరుతో ప్రభుత్వమే మద్యం విక్రయించి అప్పటి వరకు రాష్ట్రంలో టాప్ బ్రాండ్లను పక్కనపెట్టేసి వివిధ రకాల నాశిరకం మద్యాన్ని తీసుకువచ్చారు. ఈ జేబ్రాండ్‌తో పెద్దఎత్తున విమర్శలు వచ్చేవి. అవి తాగి కొందరు మృతువాత పడితే ఇంకొందరు లివర్ సంబంధిత వ్యాధితో ఆసుపత్రిపాలై తీవ్రంగా నష్టపోయారు. ఇక ఎలా అంటే టీచర్లను కూడా మద్యంషాపు విక్రయాల్లో నియమించింది. జీతాల కోసం కూడా ప్రభుత్వ ఉద్యోగులు ఎదురు చూడాల్సిన పరిస్థితి. గతంలో 1వ తేది జీతాలు వచ్చేవి. లేదంటే మొదటి వారంలోనే జీతాలు పడుతుండేవి. అయితే జగన్ హయాంలో జీతాలు ఎప్పుడు వస్తాయో తెలియక ఉద్యోగులు ఆందోళన చెందేవారు. ఈఎంఐలు కట్టలేక బౌన్స్ అయి సిబిల్ స్కోరుపై ఎఫెక్ట్ పడింది.

కబ్జాలే కబ్జాలు



జిల్లాలో ఐదేళ్లలో వాగులు వంకలు ప్రభుత్వ భూములు, చివరికి ప్రైవేటు ఆస్తులు సైతం లాక్కున్నారు. కడప, బద్వేలు, ప్రొద్దుటూరు, పులివెందుల, వేంపల్లె, జమ్మలమడుగు, పోరుమామిళ్ల, మైదుకూరు, దువ్వూరు, కమలాపురం, గోపవరం లాంటి ప్రాంతాల్లో భారీ ఎత్తున భూకబ్జాలు సాగాయి. ఇందుకోసం కడపలో అయితే ఏకంగా గ్యాంగ్‌లనే ఏర్పాటు చేసుకుని భూకబ్జాలకు పాల్పడేవారు. స్టేషన్ వెళ్లినా కూడా వీరిని అడ్డుకునే నాథుడే లేడు. చివరికి సెటిల్‌మెంట్లలో లావాదేవీల్లో తేడా రావడంతో వైసీపీకి చెందిన శ్రీనివాసరెడ్డిని 2023 జూన్ 23న తోటిగ్యాంగే పట్టపగలే కత్తులతో పొడిచి దారుణంగా హత్య చేసింది. ఓ ఫిట్‌నెస్ సెంటర్ నుంచి వస్తున్న శ్రీనివాసరెడ్డిని పిడిబాకులతో పొడిచి హత్య చేశారు. ఇది అప్పట్లో పెద్ద సంచలనంగా మారింది. ఇక అదే ఏడాది ఫిబ్రవరి 21న సాయిబాబా థియేటరు వద్ద ఓ బార్‌లో ఇద్దరు యువకులు రేవంత్, అభిలాష్‌లను దారుణంగా పొడిచి చంపారు. ఇవన్నీ గ్యాంగ్‌లే కావడం గమనార్హం. అప్పట్లోనే 25 గ్యాంగ్‌లు ఉన్నాయి. ఇక పశుసంవర్థక శాఖలో డీడీగా పనిచేస్తున్న అచ్చెన్నను దారుణంగా హత్య చేశారు. ఇది అప్పట్లో చర్చనీయాంశంగా మారింది. ఇక ఇంటెలిజెన్స్‌లో పనిచేస్తున్న సీఐ అనిల్‌కుమార్‌ను రాయచోటిలో కర్రలతో గొడ్డును బాదినట్లు బాదడం పోలీసుశాఖలోనే అప్పట్లో సంచలనంగా మారింది. పోలీసులను కొట్టినా కూడా పట్టించుకోలేని దుస్థితి.

కాల్పులతో కలకలం

ఎంపీ అవినాశ్‌రెడ్డి అనుచరుడు భరత్‌యాదవ్ 2023 మార్చి 23న గన్‌తో ఇద్దరిపై కాల్పులు జరపడం స్టేట్‌లోనే సంచలనంగా మారింది. డబ్బుల విషయమై తేడా రావడంతో పులివెందులలోని నగరిగుట్టకు చెందిన దిలీప్‌కుమార్, రాగిపాటి మహబూబ్ అలియాస్ యాక్షన్ బాషపై కాల్పులు జరిపారు. ఈ ఘటన భయాందోళన కలిగించింది.

ల్యాండ్ టైటిల్‌యాక్ట్

ప్రమాదకరమైన ల్యాండ్ టైటిల్ యాక్ట్‌ను తీసుకువచ్చి సొంత భూములు, ఇళ్లస్థలాల భూములు కూడా పరాధీనమయ్యే పరిస్థితి ఉండేది. ల్యాండ్ టైటిల్ యాక్ట్ రద్దు చేయాలని పెద్ద ఎత్తున నిరసనలు చేసినా కూడా డోంట్ కేర్ అంటూ ముందుకెళ్లారు. ఇక రైతుల పట్టాదారు పాస్‌పుస్తకాలపై జగన్ బొమ్మతో కూడిన పాస్‌బుక్‌లు ఇచ్చారు. తీవ్ర విమర్శలకు తావిచ్చింది.

బీసీ నేత దారుణహత్య



ప్రొద్దుటూరులో బీసీ నేత నందం వెంకటసుబ్బయ్యను అధికారుల సాక్షిగా పట్టప గలే అత్యంత దారుణ ంగా లేపేశారు. ప్రొద్దుటూరులో జరిగిన అవినీతి, వైసీపీ నేతల ఆగడాలపై ఈయన ప్రశ్నిస్తూ ఉండేవారు. అక్రమాలను బయట పెడుతుండేవారు. దీన్ని సహించని వారు జీర్ణించుకోలేక జగనన్న ఇళ్ల నిర్మాణానికి ఒక పక్క అధికారులు శంకుస్థాపన, భూమిపూజ చేస్తుండగానే చంపేశారు. వైసీపీ మినహా రాజకీయ పార్టీలు నిరసన వ్యక్తం చేయాలన్నా అనుమతిచ్చేవారు కాదు. ఇక సవాలక్ష ఆంక్షలు పెట్టేవారు. పోలీసు స్టేషన్లన్నీ వైసీపీ స్టేషన్లుగా మార్చేశారు. వైసీపీ నేతలు చెబితే తప్ప పోలీసుస్టేషనులో కేసు నమోదు చేసేవారు కాదు. ఇలా ఐదేళ్ల పాలనలో జనం బిక్కుబిక్కుమంటూ కాలం గడిపారు. విముక్తి కలిగి నేటితో ఏడాది అయింది.

జిల్లా సమగ్ర సమాచారంతో గ్రామదర్శిని

● అందుబాటులోకి డొక్కాసీతమ్మ మధ్యాహ్న బోజన పథకం
● కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి



మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి

కడప కలెక్టరేట్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): జిల్లా సమగ్ర సమాచారాన్ని మరింత సులభ తరంగా తెలుసుకునేందుకు గ్రామదర్శిని అనే ప్రత్యేక యాప్‌ను అందుబాటులోకి తీసుకురానున్నామని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి పేర్కొన్నారు. మంగళవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో జిల్లాకు సంబంధించి సమగ్ర సమాచారాన్ని ప్రజలు తెలుసుకొనే అంశంపై అమరావతి నుంచి వచ్చిన యాప్ డెవలపర్స్, సంబంధిత శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి జూమ్ ద్వారా జేసీ అదితిసింగ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు విశ్వవ్యాప్తం చేసే దిశగా ఒకే చోట జిల్లాకు సంబంధించిన అన్ని రకాల సమాచారాన్ని ప్రజలు సమగ్రంగా, సులువుగా తెలుసు కొనేందుకు ఈ యాప్‌ను రూపొందించినట్లు తెలిపారు. గ్రామ స్థాయి నుంచి మండల, డివిజన్, జిల్లా స్థాయి వరకు ఈ యాప్ ద్వారా అన్ని శాఖలకు సంబంధించిన సమాచారాన్ని సులువుగా తెలుసుకోవచ్చన్నారు. గ్రామదర్శిని (గ్రామ మానిటరింగ్ సిస్టమ్) యాప్ ద్వారా గ్రామాల్లో డోర్ టు డోర్ చెత్త కలెక్షన్, ఎస్‌డబ్ల్యూపీసీ, ల్యాండ్ సర్వే, విలేజ్‌మ్యాప్, అడంగల్, దీపం, గ్యాస్ సరఫరా, గ్రామీణ నీటి సరఫరా, పౌరసరఫరాల వివరాలు, వివిధ పౌరసేవలకు సంబంధించిన సమాచారాన్ని తెలుసుకోవచ్చన్నారు. ఈ గ్రామ దర్శినితో పాటు పోస్టల్ మానిటరింగ్ సిస్టం, డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం, వెండర్ కనెక్ట్ వంటి యాప్‌లను ఎన్ఐసీ సెంటర్ సహకారంతో జిల్లా వెబ్‌సైట్, ప్లేస్టోర్‌లో కూడా డౌన్‌లోడ్ చేసుకోవచ్చన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకానికి సంబంధించిన యాప్ నిర్వహణ, పర్యవేక్షణ సంబంధించిన అంశంపై పీపీటీ ద్వారా డెవలపర్స్ జిల్లా కలెక్టర్‌కు వివరించారు. ఈ కార్యక్రమంలో పీపీవో హజరతయ్య, డీఈవో షంషుద్దీన్, ఆగ్రోస్ డీఎం ఏడీపీ జిల్లా పర్యవేక్షకుడు జోయల్ విజయకుమార్ సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

జనాభా నిర్వహణ విధానాన్ని రూపొందించాలి

● కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి

కడప కలెక్టరేట్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): మారుతున్న జనాభాను దృష్టిలో పెట్టుకొని ప్రత్యేకమైన జనాభా నిర్వహణ విధానాన్ని రూపొందించాలని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి పేర్కొన్నారు. మంగళవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో జనాభా నిర్వహణ విధానం ప్రతి కుటుంబం ముఖ్యం- మీ అభిప్రాయం ముఖ్యమనే పోస్టర్‌ను సీపీవో హజరతయ్యతో కలిసి కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కాలానుగుణంగా జనాభాలో మార్పుల నేపథ్యంలో ఆలోచన, సామాజిక నిర్మాణంలో చోటు చేసుకున్న మార్పులు, తగ్గుతున్న కుటుంబ పరిమాణం, వృద్ధుల సంఖ్య పెరుగుదల, జనాభా తగ్గుదల, పని వయస్సు గల ప్రజల జీవన శైలిలో ప్రజల అవసరాలు, ఆశయాలు మారుతున్నాయన్నారు. ప్రజల అవసరాలకు ప్రతిస్పందించే విధంగా వ్యూహాలు, విధానాలను అభివృద్ధి చేయడం అవసరమని తెలిపారు. కుటుంబాలకు అవసరమైన మద్దతు, ఆరోగ్య సేవల మెరుగుదల, పిల్లలు, మహిళలు, వృద్ధులు వంటి వర్గాలకు మెరుగైన జీవన ప్రమాణాలు కల్పించేందుకు అవసరమైన సామాజిక మౌలిక సదుపాయాల అబివృద్ధి విషయంలో ప్రభుత్వం అంచనాలు వేయనుందన్నారు. ఈ సర్వేలో యువత తమ భవిష్యత్తును ప్రణాళికాబద్ధంగా నిర్మించుకునేందుకు ప్రోత్సాహం ఇవ్వడమే కాక ఉద్యోగస్తులు తమ పని కుటుంబ జీవితం మధ్య సమతుల్యత సాధించేందుకు అవసరమైన మద్దతును అందించేందుకు ప్రభుత్వం దోహదపడుతుందన్నారు.

పకడ్బందీగా మెగా డీఎస్సీ పరీక్షలు : కలెక్టర్

కడప కలెక్టరేట్, జూన్ 3(ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీ-2025కు సంబంధించి వైఎస్సార్ కడప జిల్లాలో ఈ నెల 6 నుంచి 30వ తేది వరకు పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి పేర్కొన్నారు. మంగళవారం కలెక్టరేట్ బోర్డు మీటింగ్ హాలులో జరిగిన మెగా డీఎస్సీ పరీక్షల నిర్వహణపై ఎస్పీ అశోక్‌కుమార్, జిల్లా విద్యాశాఖాధికారి షంషుద్దీన్‌తో కలిసి ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులకు అన్ని సౌకర్యాలు కల్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

వెన్నుపోట్లకు... గొడ్డలివేట్లకు పేటెంట్ జగన్‌రెడ్డి

● మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, రితేశ్‌రెడ్డి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, రితేశ్‌రెడ్డి

బద్వేలుటౌన్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : వెన్నుపోట్లకు, గొడ్డలివేట్లకు పేటెంట్ జగన్‌రెడ్డేనని, దొంగే...దొంగ.. దొంగ అన్నట్లు జగన్‌రెడ్డి వెన్నుపోటు దినం జరుపుతాన నడం సిగ్గుచేటని మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, రితేశ్‌కు మార్‌రెడ్డిలు అన్నారు. మంగళవారం బద్వేలులో వారు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి తన సొంత చిన్నాన్నను గొడ్డలివేటుతో చంపించి గుండెపోటుగా చిత్రీకరించి, అసత్య ప్రచారా లతో ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చి రాష్ట్రాన్ని సర్వనాశనం చేశాడని తెలిపారు. కూటమి ప్రభుత్వం ప్రజారంజక పాలననుచూసి ఓర్వలేకే ఇలాంటి ధర్నాలు చేస్తున్నారని తెలిపారు. ఏ ప్రభుత్వం చేయని విధంగా తొలి ఏడాదిలోనే 80 శాతం హామీలను కూటమి ప్రభుత్వం అమలు చేసిందన్నారు. సంక్షేమం, అభివృద్ధి సమపాలనలో చేస్తున్న నాయకుడు చంద్రబాబునాయు డని, అసలైన వెన్నుపోటుదారుడు జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. జూన్ 4వ తేదీ ప్రజాస్వామ్యంలో చీకటి అధ్యా యానికి ముగింపు పలికిన దినమని, వైసీపీ నాయకులు ప్రజా సమస్యలపై దృష్టి పెట్టకుండా వర్గ విభేదాలు, వ్యక్తిగత విమర్శలవైపు దృష్టి మళ్లిస్తున్నారన్నారు. కడప గడపలో మహానాడు విజయవంతం కావడమే ప్రజారంజక పాలనకు నిదర్శనమన్నారు. వైఎస్ రాజశే ఖర్‌రెడ్డి అధికారంలో ఉన్నప్పుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి కాంగ్రెస్ పార్టీని అడ్డుపెట్టుకుని లక్షల కోట్ల దోచు కొని, అదే పార్టీకి వెన్నుపోటు పొడిచి వైసీపీని స్థాపించా రన్నారు. జగన్‌మోహన్‌రెడ్డిని ఎత్తుకుని పెంచిన బాబా యిని నరికి చంపిన కిరాతకులను కాపాడుతున్నారని, ఆస్తికోసం తల్లి, చెల్లిని ఇంటి నుంచి గెంటేసి కుటుంబ వ్యవస్థకే వెన్నుపోటు పొడిచారన్నారు. ఆయన ఎన్ని డ్రామాలు, ధర్నాలు చేసినా ప్రజలు నమ్మేస్థితిలో లేరని తెలిపారు.

మాతృ మరణాలు జరగకుండా చర్యలు తీసుకోవాలి

● డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ నాగరాజు



సిబ్బందితో మాట్లాడుతున్న డీఎంఅండ్‌హెచ్ఓ నాగరాజు

కడప కలెక్టరేట్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): గర్భిణీలకు కాన్పుల సమయంలో మాతృమరణాలు సంభవించకుండా వైద్యులు బాధ్యతగా విధులు నిర్వహించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ నాగరాజు ఆదేశించారు. మంగళవారం డీఎంఅండ్ హెచ్ఓ కార్యాలయంలో నేకేదిన్నె, సురభి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు సంబంధించిన మాతృ మరణాలపై వైద్యాధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా డీఎంఅండ్‌హెచ్ఓ మాట్లాడుతూ మాతృమరణాలు జరగడానికి కారణాలు తెలపాలంటూ సంబంధిత పీహెచ్‌సీల వైద్యులు, ఉన్నతాసుపత్రి స్పెషలిస్టులతో చర్చించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రైవేట్ ఆసుపత్రులు, సర్వజన ఆసుపత్రికి సంబంధించిన వైద్యులతో వారు అందించిన సేవలను గూర్చి తెలుసుకున్నారు. ప్రమాదకర గర్భవతులను ఎప్పటికప్పుడు గుర్తిస్తూ వారిని ఆరోగ్య సిబ్బంది ఫాలోఅప్ చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీఐఓ డాక్టర్ ఉమామహేశ్వరకుమార్, జీజీహెచ్ డాక్టర్ నీలిమ, డాక్టర్ ఫరూక్, డాక్టర్ ఉజ్వల, అరుణకుమారి, ప్రైవేట్ ఆసుపత్రుల సిబ్బంది హాజరయ్యారు.

233 బస్తాల రేషన్ బియ్యం పట్టివేత



7

మత్తుపై ఈగల్ నిఘా

● డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యం
● ఎస్పీ ఈజీ అశోక్‌కుమార్



పోస్టరు విడుదల చేస్తున్న ఎస్పీ అశోక్‌కుమార్

కడప క్రైం, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): డ్రగ్స్ రహిత సమాజమే మన లక్ష్యమని, సమష్టి కృషితో పారదోలుదామని ఎస్పీ ఈజీ అశోక్‌కుమార్ పిలుపునిచ్చారు. మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో 'ఈగల్' ఆధ్వర్యంలో మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలపై అవగాహన కల్పించే పోస్టర్లను ఎస్పీ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ మత్తు పదార్థాల నివారణకు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రత్యేక ఈగల్ వ్యవస్థపై ప్రజలకు, యువతకు విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం గంజాయి, ఇతర డ్రగ్స్‌ను కట్టడి చేసేందుకు రాష్ట్ర వ్యాప్తంగా ఈగల్ పేరుతో యాంటీ డ్రగ్స్ టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రతి జిల్లాలో ఈ టాస్క్‌ఫోర్స్ విభాగం ఉంటుందని, గంజాయి విస్తరించడంతో కీలక పాత్ర పోషించే పెడ్లర్లు, ట్రాన్స్‌పోర్టులు వినియోగించే వారిపై ప్రత్యేక దృష్టి పెట్టి నియంత్రించడమే లక్ష్యంగా ఉంటుందన్నారు. ఎక్కడైనా గంజాయి అక్రమరవాణా, సాగు విక్రయాలు, వినియోగం తదితర గురించి సమాచారాన్ని టోల్‌ఫ్రీ నెం.1972కు తెలపాలని ఎస్పీ ప్రజలకు సూచించారు. యువత తమవంతు సామాజిక బాధ్యతగా గంజాయి రహిత సమాజ నిర్మాణానికి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఈగల్ టాస్క్‌ఫోర్స్ నోడల్ ఇన్‌చార్జ్ ఆఫీసర్, ఫ్యాక్షన్ జోన్ ఇన్‌స్పెక్టర్ ఎస్ఎండీ రియాజ్ అహ్మద్, సైబర్ సెల్ సీఐ నాగరాజు, డీసీఆర్‌బీ ఎస్‌బీ బీవీ క్రిష్ణయ్య పాల్గొన్నారు.

గందరగోళంగా బదిలీల ప్రక్రియ

● ఉపాధ్యాయుల్లో వీడని ఆందోళన
● ఎస్‌జీటీల స్థానచలనంపై సందిగ్ధత



కడప ఎడ్యుకేషన్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఉపాధ్యాయ బదిలీల ప్రక్రియ ప్రారంభం కాగా ఇప్పటివరకు గ్రేడ్-2 ప్రధానోపాధ్యాయులకు బదిలీలు, ఎస్ఏలకు హెచ్ఎంలుగా ఉద్యోగోన్నతి, ప్రాథమిక పాఠశాలల హెచ్ఎంలకు ఉద్యోగోన్నతి ప్రక్రియ వివాదాల నడుమ పూర్తి చేశారు. ఇకపై అసలు గందరగోళం ప్రారంభం కానుంది. ఎస్సీల బదిలీలు, ఎస్టీల బదిలీలతో జిల్లాలో కోలాహలం నెలకొననుంది. ఇప్పటికే వీరి దరఖాస్తు ప్రక్రియ పూర్తి కాగా అభ్యంతరాలను స్వీకరించి పరిశీలిస్తున్నారు. వీటిలో అన్ని రకాల సమస్యలను పొందుపరిచి అప్రమత్తంగా లేకుంటే స్థానాలు పొందే విషయంలో తమకు అన్యాయం జరుగుతుందని ఉపాధ్యాయులు వాపోతున్నారు. బదిలీల్లో పాయింట్లే కీలకం కావడంతో ఎవరికి వారు తమ ప్రయత్నాలను ముమ్మరం చేస్తున్నారు. ప్రధానంగా స్పౌజ్ విషయంలో కొందరు ఉపాధ్యాయులు లబ్ధి పొందారన్న ఆరోపణలు ఉన్నాయి. వీటన్నిటిపై అధికారులు పూర్తి స్థాయిలో విచారించి బదిలీలు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు.

అయోమయంలో ఎస్ఏల బదిలీలు

జిల్లాలో స్కూల్ అసిస్టెంట్ల బదిలీల ప్రక్రియ అయోమయంగా మారింది. బదిలీల నియమావళి ప్రకారం జూన్ 1, 2వ తేదీల్లో బదిలీల్లో ప్రాధాన్యత క్రమంలో వెబ్ ఆప్షన్స్ ఇవ్వాల్సి ఉంటుంది. అనంతరం 3న బదిలీ ఉత్తర్వులు అందజేస్తారు. అర్హులైన ఎస్టీలకు ఎస్ఏలకు ఉద్యోగోన్నతులు కల్పిస్తారు. దీనికోసంగా ఎస్టీలు తాము కోరుకునే స్థానాలకు వెబ్ ఆప్షన్ ఇవ్వాల్సి ఉంటుంది. 8వ తేదీన స్కూల్ అసిస్టెంట్లుగా ఉద్యోగోన్నతులు పొందిన వారికి నియామక ఉత్తర్వులు అందజేస్తారు. అయితే ఇంత వరకు స్కూల్ అసిస్టెంట్ల సీనియారిటీ తుది జాబితా విడుదల కాలేదు. మంగళవారం గ్రేడ్-2 హెచ్ఎంలగా పదోన్నతులు పొందిన స్కూల్ అసిస్టెంట్లకు నియామక పత్రాలు అందజేయలేదు. ఈ ప్రక్రియ పూర్తయినట్లయితే స్కూల్ అసిస్టెంట్ల సీనియారిటీ జాబితా ప్రకటించే అవకాశం ఉంటుంది. మంగళవారం రాత్రికి తుది జాబితా ప్రకటిస్తే బుధవారం నుంచి స్కూల్ అసిస్టెంట్ బదిలీల్లో ప్రాధాన్యత క్రమంలో వెబ్ ఆప్షన్స్ ఇచ్చే అవకాశం ఉంటుంది. అనంతరం బదిలీలు ఉత్తర్వులు అదజేశారు. మిగిలిన స్కూల్ అసిస్టెంట్ ఖాళీలలో అర్హులైన ఎస్టీటీలకు పదోన్నతి కల్పిస్తారు. తర్వాత స్కూల్ అసిస్టెంట్‌గా పదోన్నతి పొందిన వారికి నియామకపత్రాలు అందజేస్తారు. ఈ ప్రక్రియ అంతా జూన్ 6 లోగా పూర్తి కావాల్సి ఉంది. అయితే ఇంత వరకు స్కూల్ అసిస్టెంట్ల బదిలీల ప్రక్రియ ప్రారంభం కాలేదు. ఈ ప్రక్రియ ఎప్పటికీ పూర్తవుతుందో అని ఉపాధ్యాయులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

జిల్లాలో ఉపాధ్యాయుల వివరాలు

ఉమ్మడి కడప జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ యాజమాన్యంలో 127 మంది, ఎంపీపీ, జడ్పీ యాజమాన్యంలో 6,025 మంది, పురపాలక సంఘాల పరిధిలో 44 మంది మొత్తం 6696 మంది ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు. వీరిలో ప్రధానోపాధ్యాయులు 25 మంది, ఉపాధ్యాయులు 1845 మంది, సర్‌ఎస్ జాబితాలోని ఉపాధ్యాయులు 621 మంది తప్పనిసరి బదిలీల జాబితాలో ఉన్నారు. వీరితో పాటు రెండేళ్ల సర్వీసు పూర్తితో దరఖాస్తు చేసుకునే వారు మరికొంతమంది ఉన్నారు.

91 మందికి ఉద్యోగోన్నతులు

జిల్లాలో పనిచేస్తున్న గ్రేడ్-2 హెచ్ఎంలకు 102 మంది బదిలీలు నిర్వహించి ఉత్తర్వులు అందజేశారు. ఖాళీ అయిన స్థానాలను అర్హులైన స్కూల్ అసిస్టెంట్ల నుంచి దరఖాస్తులు స్వీకరించి జడ్పీ మేనేజిమెంట్ 88 మందికి, మున్సిపాలిటీలో 3 కలిపి మొత్తం 91 మంది ఉద్యోగోన్నతి కల్పించారు.

ఎస్‌జీటీలకు ఆన్‌లైనా, మాన్యువలా ?

ఎస్టీలకు సంబంధించి కౌన్సెలింగ్‌ను ఆన్‌లైన్‌లో నిర్వహిస్తారా ? లేదా మాన్యువల్‌గా అన్నదానిపై అనిశ్చితి నెలకొంది. జిల్లాలో ఎస్జీటీల సంఖ్య అధికం కావడంతో పాఠశాలలను ఎంపిక చేసుకోవాల్సిన అంశం కీలకంగా మారనుంది. గరిష్టంగా 2వేల ఆప్షన్లు ఇవ్వాల్సి రావడంతో వీరంతా తమకు మాన్యువల్ గానే కౌన్సెలింగ్ నిర్వహించాలని డిమాండ్ చేస్తున్నారు. అధికారులు మాత్రం దీనిపై ఎలాంటి స్పష్టత ఇవ్వకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. వీరికి సంబంధించిన జూన్ 6న తుది సీనియారిటీ జాబితాను విడుదల చేయనున్నారు. అయితే వీరికి వెబ్ ఆప్షన్లా లేక మాన్యువల్ గానా అన్న అంశంపై మాత్రం ఖచ్చితమైన ఆదేశాలు రావాల్సి ఉంది. దీనికోసం అందరూ వేచి చూస్తున్నారు. ఉత్తర్వులు వస్తే జూన్ 7 నుంచి 10వ తేది వరకు ఎస్‌జీటీలు కోరుకున్న స్థానాలకు ప్రాధాన్యత క్రమంలో అవకాశం కల్పించి జూన్ 11న బదిలీ ఉత్తర్వులు విడుదల చేస్తామని అధికారులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి


రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన కుమారి

రామాపురం, జూన్ 3(ఆంధ్రజ్యోతి): కర్నూలు- చిత్తూరు 40వ జాతీయ రహదారిపై మంగళవారం కంభంపాటి కుమారి (32) మృతి చెందినట్లు ఎస్ఐ వెంకటసుధాకర్ రెడ్డి తెలిపారు. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. గాలివీడు మండలం కమలాపురానికి చెందిన కంభంపాటి కుమారి మంగళవారం తమ తల్లిగారి ఊరైన రామాపురం మండలం నీలకంఠ్రావుపేట పంచాయతీ గాండ్లపల్లికి ఏపీ04 టీఎక్స్ 8555 నెంబరు గల రాయచోటి డిపోకు చెందిన హెయిర్ బస్సులో బయలుదేరారు. దర్గా రోడ్డు బస్‌స్టాప్ వద్ద బస్సు దిగుతుండగా బస్సు ఒక్కసారి కదలడంతో ఆమెపై రెండు టైర్లు ఎక్కాయి. సంఘటన స్థలానికి రామాపురం పోలీసులు చేరుకొని 108 వాహనం ద్వారా కడప రిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్ఐ వెంకటసుధాకర్‌రెడ్డి తెలిపారు. కాగా ఈమెకు గాలివీడు మండలం కమలామర్రి గ్రామంలో 2010లో రెడ్డెప్పతో వివాహమైంది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

లారీ ఢీకొని వృద్ధుడు ..


నారాయణ మృతదేహం

కలకడ, జూన్ 3(ఆంధ్రజ్యోతి): లారీ ఢీకొనడంతో ఓ వృద్ధుడు మృతి చెందినట్లు ఎస్ఐ రామాంజనేయులు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మదనపల్లె లక్ష్మీ నగర్‌కు చెందిన నారాయణ (60) ఎర్రయ్యగారిపల్లెలోని బంధువుల ఇంటికి వచ్చి, తిరిగి బస్టాండుకు నడిచి వెళ్లుతుండగా ఎర్రగుంట్ల నుంచి చిత్తూరు వెళుతున్న లారీ.. ముందు వెళ్లుతున్న వాహనాన్ని ఓవర్ టేక్ చేసే సమయంలో ఆయనను ఢీకొంది. ఈ ప్రమాదంలో వృద్ధుడి తలకు బలమైన గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పీలేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఎస్ఐ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు వివరించారు.

రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలకు తీవ్ర గాయాలు


చికిత్స పొందుతున్న వెంకటమ్మ

సిద్దవటం, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో భార్యాభర్తలకు తీవ్రగాయాలయ్యాయి. గ్రామస్థులు మెరుగైన వైద్యసేవల కోసం 108 వాహనంలో కడప రిమ్స్‌కు తరలించారు. స్థానికులు, పోలీసుల కథనం మేరకు... భాకరాపేట గ్రామానికి చెందిన భార్యాభర్తలు నల్లగొండ చెన్నయ్య, వెంకటమ్మ సోమవారం రాత్రి శివాలయం వద్ద హైవే రోడ్డు దాటుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొంది. చెన్నయ్య తలకు బలమైన గాయం కాగా, వెంకటమ్మ ఎడమకాలు పూర్తిగా విరిగిపోయింది. వైద్యసేవల కోసం సోమవారం రాత్రి అంబులెన్స్‌లో కడప రిమ్స్‌కు తరలించినట్లు గ్రామస్థులు తెలిపారు. ఈ మేరకు సిద్దవటం ఎస్ఐ మహమ్మద్‌రఫీ మాట్లాడుతూ ఢీకొన్న వాహనం ఆచూకీ సీసీ పుటేజీలను పరిశీలిస్తున్నామని, హైవేరోడ్డు దాటేప్పుడు ప్రజలు అప్రమత్తంగా ఉండి వాహనాల రాకపోకలు గమనించి రోడ్డు దాటాలని తెలిపారు.

పంట పొలాలపై రైతులకు అవగాహన


మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ అధికారి చంద్రానాయక్

చిన్నమండెం, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): పంట పొలాలపై రైతులకు అవగాహన కార్యక్రమాన్ని జిల్లా వ్యవసాయ అధికారి చంద్రానాయక్, ఉద్యానవాధికారి రవీంద్రబాబు మంగళవారం నిర్వహించారు. వికసిత్ కృషి, సంకల్ప అభియాన్ కింద కేవీకే ఊటుకూరు వారి ఆధ్వర్యంలో చిన్నమండెం, బోరెడ్డిగారిపల్లె గ్రామాల్లో రైతు సేవా కేంద్రాల్లో రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉద్యానవణాధికారి వనితాబాయి, ఏవో గీత, శాస్త్రవేత్తలు ప్రశాంతి, శిల్పకళ, రైతు సేవా కేంద్రం సిబ్బంది, జిల్లా వ్యవసాయాధికారి సుచిత్ర, 150 మంది రైతులు పాల్గొన్నారు.

అక్కడ స్మగ్లర్‌దే పెత్తనం..?


అనధికార వీఆర్ఏకు ఆన్‌లైన్ చేసి కట్టబెట్టిన ప్రభుత్వ భూమిలో సాగు చేసిన మామిడితోట

- తల్లికి బదులు 16 కేసుల్లో నిందితుడిగా ఉన్న కొడుకు వీఆర్ఏగా విధులు
- ప్రతిరోజు తహశీల్దారు, ఆర్ఐ ఎదుట కూర్చుని ముచ్చట్లు
- ఎవరికి ఏ పనికావాలన్నా తను ఓకే అంటే చాలు..

పుల్లంపేట, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): పుల్లంపేట తహశీల్దారు కార్యాలయం అవినీతికి అడ్డాగా మారింది. గతంలో ఇక్కడ పనిచేసిన తహశీల్దారులంతా కోట్లకు పడగలెత్తారని కిందిస్థాయి సిబ్బందితో పాటు ప్రజలు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వ భూములు అక్రమార్కులకు ఆన్‌లైన్ చేసి కోట్ల రూపాయలు దండుకున్నారు. డీకేటీ భూముల అమ్మకంలో లబ్ధిదారుల పేర్లు మార్చేందుకు లక్షల్లో వసూలు చేశారని బాహాటంగా చెబుతున్నారు. వైసీపీ ప్రభుత్వ హయాం నుంచి ఈ తహశీల్దారు కార్యాలయం గంజాయి, ఎర్రచందనం స్మగ్లర్లకు అడ్డాగా మారింది. వీరి ద్వారానే కోట్లాది రూపాయల లావాదేవీలు, డీకేటీ భూములకు సంబంధించి యజమానుల పేర్లు మార్పు జరిగాయనే ఆరోపణలు ఉన్నాయి. ప్రభుత్వం మారినా తహశీల్దారు కార్యాలయంలో మాత్రం ఇప్పటికీ స్మగ్లర్లే రాజ్యమేలుతున్నారు.

16 ఎర్రచందనం కేసుల్లో ఉన్నా..

పుల్లంపేట గ్రామ రెవెన్యూ విలేజ్‌లో వీఆర్ఏగా పనిచేస్తున్న మహిళ తనకు ఆరోగ్యం సరిగా లేదని, కుమారునికి విధులు అప్పజెప్పారు. అయితే అతను 16 ఎర్రచందనం కేసుల్లో నిందితుడిగా ఉన్నాడు. ఆ కేసుల్లో జైలుకు వెళ్లిన అతను ప్రస్తుతం బెయిల్‌పై ఉన్నాడు. వీఆర్ఏ అంటే తహశీల్దారు కార్యాలయంలో అన్నిటి కంటే చిన్న ఉద్యోగం ఇదే. అయితే ఇతను మాత్రం పుల్లంపేట తహశీల్దారు కార్యాలయంలో తహశీల్దారు కంటే పెద్ద అని చెప్పుకోవచ్చు. రోజూ ఆఫీసుకు రావడం.. తహశీల్దారు ఎదుట లేదా ఆర్ఐ ఎదుట కుర్చీలో దర్జాగా కూర్చుని గంటల తరబడి మాట్లాడుతూ ఉంటాడు. తహశీల్దారు కార్యాలయంలో ఇతను అనుకుంటే జరగని పని ఉండదు. గతంలో పనిచేసిన తహశీల్దారుకు, ఇప్పుడు పనిచేస్తున్న రెవెన్యూ అధికారులందరికీ ఈ అనధికార వీఆర్ఏ సకల సౌకర్యాలు కల్పిస్తూ పనులు చేయించుకుంటున్నాడని అంటున్నారు. రెవెన్యూ అధికారులకు, అక్రమార్కులకు ఇతను మధ్యవర్తిగా ఉంటున్నాడని.. అందుకు ప్రతిఫలంగా అధికారులు ప్రభుత్వ భూములను అతనికి కట్టబెట్టేశారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇతను గత ఆరేళ్లుగా ఇక్కడే విధులు నిర్వహిస్తున్నాడు.

ఇవీ ఉదాహరణలు..

అనధికార వీఆర్ఏగా వ్యవహరిస్తున్న ఈ ఎర్రచందనం స్మగ్లర్ నిబంధనలకు విరుద్ధంగా తిరుపతి-కడప హైవే పక్కన కస్తూర్భాగాంధీ బాలికల పాఠశాల పక్కనే సుమారు ఐదెకరాల భూమిని స్వాధీనం చేసుకుని చుట్టూ కంచె వేసి ఎస్టేట్‌లాగా మార్చుకున్నాడు. అధికారులు సైతం వీఆర్ఏ బంధువుల పేర్లతో నాలుగు ఎకరాలు ఆన్‌లైన్ చేసేశారు. ఆన్‌లైన్ చేయడంతో ఆ పొలంలో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసుకుని బోరు వేసి డ్రిప్ ద్వారా మామిడితోట సాగు చేస్తున్నాడు. రంగంపల్లె రెవెన్యూ విలేజ్‌లో సర్వే నెంబరు-522లో బంధువుల పేర్లతో సుమారు 40 ఎకరాలకు పైగా ఆన్‌లైన్ చేశారని సమాచారం. రెవెన్యూ అధికారులకు ఎంతగా దోచిపెట్టి సౌకర్యాలు కల్పించకపోతే అన్ని ఎకరాల ప్రభుత్వ భూములు అతడికి ఆన్‌లైన్ చేసి కట్టబెడతారని పలువురు విమర్శిస్తున్నారు.

విజిలెన్స్ విచారణ చేపట్టాలి


పుల్లంపేట చౌకదుకాణం-2 ప్రారంభోత్సవంలో టీడీపీ నాయకులతో పాటు తహసీల్దార్, ఎర్రచందనం స్మగ్లర్ పోలి రవి


ప్రభుత్వ భూమి ఆన్‌లైన్ కావడంతో బోరు వేసి ట్రాన్స్‌ఫార్మర్, పైపులైను ఏర్పాటు చేసిన దృశ్యం

ప్రభుత్వం మారినా రెవెన్యూ అధికారుల తీరు మారడం లేదని, అవినీతికి దాసోహం అయ్యారని పలువురు విమర్శిస్తున్నారు. విజిలెన్స్ అధికారులు విచారణ చేపడితే ప్రభుత్వ భూములు ఎంతమేర ఆక్రమణకు గురయ్యాయి, అధికారులు ఎన్ని ఎకరాలు నిబంధనలకు విరుద్ధంగా ఆన్‌లైన్ చేశారు, డీకేటీ భూముల అమ్మకం విషయంలో లబ్ధిదారుల పేర్లు మార్చడం ద్వారా ఎన్ని కోట్ల రూపాయలు చేతులు మారాయో వెలుగుచూసే అవకాశం ఉంది. ఆక్రమణలు తొలగించాలని కలెక్టర్ నుంచి ఆదేశాలు వస్తున్నా పుల్లంపేటలో పనిచేసే రెవెన్యూ అధికారులు దీనిని ఏమాత్రం లెక్కచేయడం లేదని తెలుస్తోంది.

ఎర్రచందనం స్మగ్లర్ అనధికారికంగా వీఆర్ఏగా పనిచేయడంపై తహశీల్దారు అరవింద కిశోర్‌ను ఆంధ్రజ్యోతి వివరణ కోరగా.. తనకు ఆరోగ్యం సరిగా లేదని తన కుమారుడిని విధులకు పంపుతున్నామని వీఆర్ఏ చెప్పడంతో ఒప్పుకుని పని చేయించుకుంటున్నామన్నారు. ప్రత్యామ్నాయ మార్గం లేకపోవడంతో అతని చేతే పని చేయించుకుంటున్నామని, ఎర్రచందనం స్మగ్లర్ అయితే ఏమి? మా ఆఫీసులో స్మగ్లింగ్ చేసేది ఏమీ లేదని అనడం గమనార్హం.

ఉపాధి ఏపీవోపై ఎమ్మెల్యే ఆగ్రహం

- వెంటనే సెలవుపై వెళ్లాలని ఆదేశం


కేవీ పల్లె మండల పురోగతిపై సమీక్షిస్తున్న కిశోర్‌కుమార్‌రెడ్డి

కలికిరి, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): కూలీలకు అవసరమైన స్థాయిలో పనులు కల్పించలేనప్పుడు ఉద్యోగాలు చేయడం ఎందుకని, కేవీ పల్లె మండలం ఉపాధి హామీ పనుల్లో జిల్లా స్థాయిలో చివరి స్థానానికి చేరడం సిగ్గుచేటని ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. పట్టణ ప్రాంతమైన పీలేరులో 45 వేల పనిదినాలు కల్పించగా జిల్లాలో అతి పెద్దదైన వెనుకబడిన మండలం కేవీ పల్లెలో కేవలం 16 వేల పనిదినాలు కల్పించడంతో ఉపాధి హామీ సిబ్బంది తీవ్ర అలసత్వాన్ని చూపిస్తున్నారని మండిపడ్డారు. మంగళవారం నగరిపల్లెలో కలికిరి, కలకడ, గుర్రంకొండ, పీలేరు, వాల్మీకిపురం, కేవీ పల్లె మండలాలకు సంబంధించిన ఉపాధి పనుల పురోగతిపై సమీక్ష నిర్వహించిన సందర్భంగా ఆయన అధికారుల తీరుపై అసహనం వ్యక్తం చేశారు. మండలం వారీగా ఏపీడీ శ్రీనివాసులు, ఎంపీడీవో, ఏపీవోలతో విడివిడిగా సమస్యల గురించి ఆరా తీశారు. ఈ సందర్భంగా ఏపీవో నాగరాజు పనితీరుపై వస్తున్న విమర్శలను ఎమ్మెల్యే ప్రధానంగా ప్రస్తావించారు. జిల్లాలో అత్యధికంగా కూలీలున్న మండలం కేవీ పల్లెలోనే పురోగతి లేకుంటే ఇక అధికారులు పేదలకు ఎలా న్యాయం చేస్తారని నిలదీశారు. వెంటనే సెలవు పెట్టి వెళ్లిపోవాలని ఏపీవోను ఆదేశించారు. ఉన్నతాధికారులు కూడా ఇలాంటి వారిపట్ల ఉదాసీనంగా వ్యవహరించడం బాధ్యతగా లేదని విమర్శించారు. మిగిలిన మండలాల్లో అధికారులు అందజేసిన నివేదికలు కాస్త సంతృప్తికరంగా వుండటంతో కూలీ సంఖ్య ఇంకా పెంచాలని సూచించారు. సీసీ రోడ్లు, గోకులాలకు బిల్లులు పెండింగ్‌లో పెట్టకుండా పనులు పూర్తి చేయించాలని సూచించారు. కూలీలకు ఇబ్బంది లేకుండా పనులను పెంచుకుంటామని అధికారులు హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో కలికిరి క్లస్టర్ ఏపీడీ శ్రీనివాసులు, ఆయా మండలాల ఎంపీడీవోలు, ఏపీవోలు ఎస్.మనోహర్ రాజు, ఎల్.సునీల్‌కుమార్ (వాల్మీకిపురం), జి.శివశంకర్, ఎం.అశోక్‌రెడ్డి (పీలేరు), సుధాకర్, నాగరాజు (కేవీ పల్లె), భానుమూర్తి, మంజుల (కలికిరి), కె.వెంకటేశులు, కె.జయరామిరెడ్డి (గుర్రంకొండ), అబ్దుల్ కరీం, డి.సుజాత (కలకడ)లు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు తీపి కబురు

ఇదిలా వుండగా తాజాగా అందిన సమాచారం మేరకు గత రెండు నెలలుగా కూలీలకు చెల్లించాల్సిన వేతన బకాయిల కోసం మంగళవారం రాష్ట్రానికి రూ.1029.55 కోట్లు విడుదలయ్యాయి. ఈ మేరకు పెండింగ్‌లో వున్న మెటీరియల్ బిల్లులతో పాటు కూలీలకు చెల్లించాల్సిన బకాయిలకు కూడా మోక్షం కలగనుంది. పెండింగ్ బిల్లులన్నీ క్లియర్ చేయడానికి చెల్లింపుల కోసం సిద్ధం చేయాలని డ్వామా కార్యాలయానికి వర్తమానం అందింది. రెండు నెలలుగా కూలీల వేతనాలు పేరుకుపోతున్న కారణంగా పనులు ప్రారంభించడానికి ఆటంకంగా వుందని చెబుతున్న అధికారులు బకాయిల విడుదలకు సంబంధించిన సమాచారం ఉపశమనం కలిగించిందని చెబుతున్నారు.

కోర్టులో గంగమ్మ జాతర ప్రారంభం

- అమ్మవారి భారీ విగ్రహ ప్రతిష్ఠ

మదనపల్లె అర్బన్, జూన్ 3(ఆంధ్రజ్యోతి): పట్టణంలో కోర్టులో గంగమ్మజాతర మంగళవారం ఘనంగా ప్రారంభమైంది. ఇందులో భాగంగా ఉదయాన్నే అమ్మవారికి విశేషంగా పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారికి అభిషేకాలు, అర్చనలు చేశారు. పట్టణంలోని శాస్త్రివీధికి చెందిన రాటకొండ బాబురెడ్డి ఇంటి నుంచి కల్లు, కమ్మర భాస్కర ఇంటి నుంచి గంగమ్మ మట్టి ప్రతిమ, జోలపాళెం భవానీ ప్రసాద్ ఇంటి నుంచి చీర, పసుపు, కుంకుమ, సారె తెచ్చారు. సాయంత్రం ఆలయకమిటీ ఆధ్వర్యంలో ఆలయ ఆవరణలో ఆరు అడుగుల ఎత్తైన గంగమ్మ ప్రతిమను ప్రతిష్ఠించారు. అనంతరం మున్సిపాలిటీ మాజీ వైస్‌చైర్మన్ జోలపాళెం భవానీప్రసాద్, జోలపాళెం దేవేంద్ర తొలిపూజ నిర్వహించారు. జోలపాళెం వంశస్థుల ఆడబిడ్డగా అవతరించిన గంగమ్మకు పుట్టింటివారు తొలిపూజ చేయడం ఆనవాయితీ. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు అమ్మవారికి విశేషంగా అలంకరించి పూజలు నిర్వహించారు. పట్టణంలోని మహిళలు అమ్మవారికి దివ్వెలు, బోనాలు సమర్పించారు. భక్తులకు ఆలయ కమిటీ సభ్యులు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. బెంగళూరు రోడ్డు, అమ్మినేనివీధి, కోర్టువీధి, పటేల్‌రోడ్డు, డాక్టర్ కజ్జన్‌వీధి, కదిరిరోడ్డుల్లో విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఈ కార్యక్రమాలను ఆలయ కమిటీ అధ్యక్షుడు చిన్నరెడ్డెప్ప, ఉపాధ్యక్షుడు వేణుగోపాల్‌నాయుడు, కార్యదర్శి ప్రభాకర్ నాయుడు, ట్రెజరర్లు రంగస్వామినాయుడు, కరుణాకర్‌నాయుడు, మహేష్, విక్కీ, మల్లికార్జున నాయుడు, శ్రీనివాస్ పర్యవేక్షించారు.


విశేషంగా అలంకరించిన కోర్టులో గంగమ్మ ఆలయం, ప్రత్యేకాలంకరణలో అమ్మవారు

ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్‌పై దాడి


దాడిలో గాయపడ్డ ఫీల్డ్ అసిస్టెంట్ నరసింహారావు, తండ్రి పిచ్చయ్య

రాజంపేటటౌన్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకం పనులకు హాజరు కాకపోయినా వేతనం వచ్చేలా చేయాలని వేధించేవారని, వారి మాట వినకపోవడంతో తాను, తన తండ్రిపై కొందరు దాడి చేసినట్లు శవనవారిపల్లె ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ మలగాని నరసింహారావు మంగళవారం మన్నూరు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళితే... సోమవారం రాత్రి 10 గంటల సమయంలో గ్రామానికి చెందిన లింగం రాజా, లింగం దుర్గయ్య, లింగం హరిబాబు, నారాయణ, అరవింద్, కొంత మందితో కలిసి ఇంటిలో ఉన్న సమయంలో తనపై, అడ్డు వచ్చిన తన తండ్రిపై కూడా దాడిచేసి ఇంటిలోని వస్తువులను కూడా ధ్వంసం చేసినట్లు తెలిపారు. ఈ ఘటనను బాధితుడు శక్తియాప్‌లో చిత్రీకరిస్తుంటే దౌర్జన్యంగా సెల్‌ఫోన్‌ను లాక్కొని ధ్వంసం చేసినట్లు తెలిపారు. గత కొన్నిరోజులుగా ఉపాధి హామీ పనులకు రాకపోయినా వేతనం వచ్చేలా చేయాలని వేధించేవారని, అందుకు నిరాకరించడంతో తనపైకి దాడికి దిగినట్లు బాధితుడు తెలిపారు. తమకు రక్షణ కల్పించి న్యాయం చేయాలని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశారు. గాయపడినవారు రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. మన్నూరు పోలీసులు కేసు నమోదు చేసుకున్నట్లు తెలిపారు.

దాడిలో గాయపడిన వృద్ధుడు


చికిత్స పొందుతున్న వృద్ధుడు

మదనపల్లె అర్బన్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): మహిళను హింసిస్తున్నాడని అడ్డుకొన్నందుకు రాడ్‌తో కొట్టి గాయపర్చిన సంఘటన మదనపల్లె మండలంలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు సోమవారం రాత్రి మదనపల్లె మండలం, మొలకలదిన్నెకు చెందిన రెడ్డెమ్మ భర్త హరిబాబు నాలుగేళ్ల క్రితం ప్రమాదంలో మృతి చెందాడు. దీంతో ఆమె తన ముగ్గురు పిల్లలతో కలసి ఉంటోంది. ఈ నేపథ్యంలో తన కోరిక తీర్చాలంటూ సమీప బంధువు ఆమెను వేధించేవాడు. ఇందుకు నిరాకరించిన ఆమెపై మంగళవారం విజయభాస్కర్, మరికొంత మంది కలిసి దాడి చేశారు. అడ్డుకున్న రమణయ్య(55)ను రాడ్‌తో కొట్టి గాయపరిచారు. స్థానికులు అతన్ని మదనపల్లె జిల్లా ప్రభుత్వాస్పత్రిలో చేర్పించారు. ఈ మేరకు తాలుకా సీఐ కళా వెంకటరమణకు ఫిర్యాదు చేశారు. విచారించి కేసు నమోదు చేస్తామని తెలిపారు.

నిత్యపూజయ్యా... ఇదేందయ్యా...!

- నిత్యపూజేశ్వర కోనలో వసతులు నిల్
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు

సిద్దవటం, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): దట్టమైన లంకమల అభయారణ్యంలో ఎత్తైన కొండ కోనల్లో కొలువుదీరిన నిత్యపూజేశ్వర స్వామి ఆలయంలో వద్ద వసతులు కరువయ్యాయి. రహదారి సరిగా లేక భక్తులకు ఇక్కట్లు తప్పడం లేదు. మండలంలోని వంతాటిపల్లె సమీపంలోని లంకమల అభయారణ్యంలో వెలసిన నిత్యపూజేశ్వర కోనకు ప్రతి సోమవారం కడప నగరంతో పాటు అట్లూరు, గోపవరం, మాధవరం, బద్వేల్, వేంపల్లె, ప్రొద్దుటూరు, మైదుకూరు, పోరుమామిళ్ల తదితర గ్రామాల నుంచి భక్తులు శివపార్వతుల దర్శనం కోసం వస్తుంటారు. మహాశివరాత్రి రోజున ఉమ్మడి కడప జిల్లా, ఇతర జిల్లాల నుంచి లక్షలాదిగా భక్తులు తరలివస్తారు. స్వామివారి సన్నిధానానికి వెళ్లే మార్గంలో రహదారికి అడ్డంగా పెద్ద పెద్ద గుండ్లు, వృక్షాలు ఉండడంతో భక్తులకు తీవ్ర ఇక్కట్లు తలెత్తాయి. భక్తులు తాగే మంచినీటి గుండాల్లో అపరిశుభ్రత ఏర్పడి దుర్వాసన వెదజల్లుతోంది. మహిళలకు మరుగుదొడ్లు వంటి సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతున్నారు. నిత్యపూజకోనకు వచ్చే భక్తులు ఇచ్చే కానుకలు లక్షల్లో వస్తున్నా మౌలిక వసతులు కల్పించడంలో ఎండోమెంట్ శాఖ పూర్తిగా విఫలమైందని పలువురు పేర్కొంటున్నారు. సన్నిదానికి వెళ్లే మెట్ల మార్గం పాక్షికంగా దెబ్బతినడంతో మోకాళ్ల మీద దర్శనానికి వెళ్లే భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు మౌలిక వసతులు ఏర్పాటు చేయాలని భక్తులు కోరుతున్నారు.

మహిళలకు వసతులు కల్పించాలి



నిత్యపూజకోనలో మహిళా భక్తులు వసతులు సరిగా లేక ఇబ్బందులు పడుతున్నారు. బట్టలు మార్చుకోవడానికి సరైన వసతి లేక చాలా ఇబ్బంది పడుతున్నాం. వెంటనే ఎండోమెంట్ ఒక గది ఏర్పాటు చేయాలి.

- లక్ష్మీదేవి, భక్తురాలు, కడప


మహిళలు దుస్తులు మార్చుకునే షెడ్డు దుస్థితి


అలంకరణలో నిత్యపూజేశ్వరస్వామి - అపరిశుభ్రంగా ఉన్న కోనలోని మంచినీటి గుండం

రహదారిని బాగు చేయాలి



నిత్యపూజ కోనకు వెళ్లే రహదారిని బాగు చేయాలి. కాలినడకన వెళ్లే భక్తులకు పెద్ద పెద్ద గుండ్లు, వృక్షాలు, ఉండడంతో వెళ్లాలంటే ఇబ్బందిగా ఉంది. అధికారులు రహదారిని అభివృద్ధి చేసి సౌకర్యంగా ఉండేలా చూస్తే భక్తుల సంఖ్య పెరిగే అవకాశం ఉంది.

- శంకరయ్య, సిద్దవటం

కేసీ నీటికి అడ్డుకట్ట

● ప్లాట్ల వ్యాపారం కోసం రోడ్డుమీదకు మళ్లింపు ● బీడువారుతున్న పంట పొలాలు



కేసీ ఉపకాలువ నీటిని రోడ్డు పక్కకు మళ్లించిన దృశ్యం

దువ్వూరు, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): కొందరి వ్యక్తుల స్వార్థంతో రోడ్డును ఆనుకుని ఉన్న స్థలం, పొలాన్ని వ్యాపారం కోసం ఉపయోగిస్తూ దిగువ ఉన్న పొలాలకు తాగునీరు వెళ్లకుండా అడ్డుపడుతున్నారు. దీంతో దిగువ ఉన్న పంట పొలాలకు సాగు నీరు అందక బీడు భూములుగా మారుతున్నాయి. ఈ నీళ్లు రోడ్డు వెంబడి ప్రవహిస్తుండడంతో ప్రమాదాలకు కారణమవుతున్నాయి. ఈ వ్యవహారం కొనసాగబట్టి అయిదేళ్లు దాటినా.. అడిగేవారు లేకపోవడంతో అక్రమార్కుల ఆగడాలకు అడ్డు అదుపు లేకుండా పోయింది. వివరాల్లోకి వెళ్లితే..

దువ్వూరులో పోలీసుస్టేషన్ ఎదురుగా రహదారి పక్కనే పడమర వైపున కేసీ ఆయకట్టు పొలాలు ఉన్నాయి. బ్రిటీష్ హయాం నుంచి కేసీ కాలువకు తూములను ఏర్పరచి ఉప కాలువల ద్వారా సాగునీరు అందిస్తున్నారు. ఇక్కడ కొందరు వ్యక్తులు వారి పలుకుబడి, పరపతిని ఉపయోగించి పొలాలకు నీరు వెళ్లకుండా కాలువలను ఆక్రమించి ప్లాట్లు వేశారు. పంట ఉత్పత్తులను తరలించేందుకు దారి ఇవ్వకుండా అడ్డుకుంటున్నారు. ప్రస్తుతం ఈ కాలువగుండా మురికినీరు ప్రవహిస్తోంది. బ్రిటీష్ హయాం నుంచి సదరు కేసీ ఉప కాలువ ద్వారా వెళ్లే నీరు పంటలకు అందుతూ చివరకు కుందూనదిని తాకేది. స్వార్థపరుల కారణంగా అమాయక రైతుల పొలాలు తడవక కొందరు బీడుగా వదిలేయాల్సిన పరిస్థితి. ఇక ఈ నీటిని రోడ్డుమీదకు మళ్లించడంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. రోడ్డు ఆక్రమణ, నీటి ప్రవాహం సమస్యను కొందరు వ్యక్తులు ఆర్‌అండ్‌బీ అధికారుల దృష్టికి సైతం తీసుకెళ్లారు. దీనికి సదరు అధికారులు సమాధానం ఇస్తూ రెవెన్యూ అధికారులు తీసుకోవాల్సిన చర్య అంటూ దాట వేస్తున్నారు. మా నుంచి ఆర్‌అండ్‌బీ అధికారులకు లెటర్ పంపామని, వారే స్పందించడం లేదని రెవెన్యూ శాఖ పేర్కొంటోంది. ఇక దిగువకు కాలువ వెంబడి సాగునీరు ట్రాన్స్‌ఫార్మర్, దిమ్మె చుట్టూ చేరుతుండడంతో అది ప్రమాదకరంగా మారిందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

అనుమతులు లేవు

పోలీసు స్టేషన్ ఎదురుగా వేసిన ప్లాట్లకు పంచాయతీ అప్రూవల్, ఇతర అనుమతులు ఇవ్వలేదు. నీరు రోడ్డుమీదకు మళ్లించిన విషయం ఆర్‌అండ్‌బీ అధికారులకు తెలిపాం. రోడ్డు విస్తీర్ణం, హద్దులు నిర్ణయిస్తే తదుపరి చర్యలు తీసుకుంటాం.

-సత్యనారాయణ,
గ్రామపంచాయతీ కార్యదర్శి



పొలాలకు వెళ్లకుండా అడ్డుకట్ట వేయడంతో ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ చేరిన కేసీ నీరు

వైవీయూలో మొక్కలు నాటేందుకు ఏర్పాట్లు పూర్తి

● జిల్లా అటవీ అధికారి వినీత్‌కుమార్



మొక్కలు నాటే స్థలాన్ని పరిశలిస్తున్న డీఎఫ్‌వో

కడప ఎన్టీఆర్ సర్కిల్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : ప్రపంచ పర్యావరణ దినత్సోవాన్ని పురస్కరించుకుని వైవీయూలో మొక్కలు నాటే ప్రదేశాన్ని మంగళవారం జిల్లా అటవీ అధికారి వినీత్‌కుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూన్ 5న యూనివర్శిటీలో 5వేల మొక్కలను నాటేందుకు అన్ని ఏర్పాట్లను పూర్తి చేసినట్లు తెలిపారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం గురించి అంద రికీ అవగాహన తీసుకువస్తున్నామని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఈ కార్యక్రమం చేపడుతున్నట్లు వివరించారు. అనంతరం ఆయన వైవీయూలో మొక్కలు నాటే ప్రదేశాలు పరిశీలిస్తూ అధికారులకు పలు సూచనలు, దిశనిర్దేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో సామాజిక అటవీ విభాగం డీఎఫ్‌వో శివకుమార్ పాల్గొన్నారు.

233 బస్తాల రేషన్ బియ్యం పట్టివేత



రేషన్ బియ్యంతో పట్టుబడిన లారీ

ఖాజీపేట, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తున్న లారీని చేసి, రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు విజిలెన్స్ సీఐ శివన్న తెలిపారు. మంగళవారం తెల్లవారు జామున కడప-కర్నూలు జాతీయ రహదారిలో దుంపలగట్టు క్రాస్ వద్ద అనుమానంతో ఏపీ 39 యూఏ 3609 నంబరుగల లారీని ఆపి తనిఖీ చేశామన్నారు. లారీలో 233 బస్తాల రేషన్ బియ్యం ఉన్నట్లు గుర్తించి డ్రైవర్ ఓబులేసును అదుపులోకి తీసుకుని విచారించామన్నారు.. ప్రొద్దుటూరుకు చెందిన తాటి శరత్‌కుమార్‌కు చెందిన బియ్యంగా తెలిపారు. పట్టుబడిన బియ్యాన్ని కడప సీఎస్‌డీటీ పీఎంతః మనోజ్‌కు, లారీని స్థానిక పోలీసు స్టేషన్‌లో సీఐ మోహన్‌కు అప్పగించడంతో పాటు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఎక్కడైనా అక్రమ రేషన్ బియ్యాన్ని తరలిస్తున్నట్లు తెలిస్తే సమాచారం ఇవ్వాలన్నారు.

విలువలతో కూడిన విద్యనందించాలి : డీఈఓ



సమావేశంలో మాట్లాడుతున్న డీఈఓ షంషుద్దీన్

కడప ఎడ్యుకేషన్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): విలువలతో కూడిన విద్యనందించాలని జిల్లా విద్యాశాఖ అధికారి షంషుద్దీన్ పిలుపునిచ్చారు. మంగళవారం కడప నగరం జయనగర్ కాలనీ బాలికల ఉన్నత పాఠశాలలో జిల్లాస్థాయి రీసోర్స్ పర్సన్‌ల మూడు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ శిక్షణలోని విషయాలను అంకిత భావంతో నేర్చుకొని తిరిగి ఉపాధ్యాయులకు చేరవేయడంలో ఫలప్రదం కావాలని సూచించారు. పాఠశాలలోని విద్యార్థులందరికి విలువలతో కూడిన విద్యనందించడానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. కడప డివిజన్ ఉప విద్యాశాఖ అధికారి రాజగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ శిక్షణలో టటీచర్స్ హ్యాండ్ బుక్, అకాడమిక్ క్యాలెండర్, కరికులం ఇంటిగ్రేషన్, అసెస్‌మెంట్ బుక్, టటీచ్ టూల్స్ వంటి అంశాలపై ఉపాధ్యాయులందరు అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా డీసీఈబీ సెక్రటరీ విజయభాస్కర్‌రెడ్డి, ఎస్‌సీఆర్‌టీ అబ్జర్వర్ బ్రహ్మానందరెడ్డి, డైట్ లెక్చరర్లు గిరిబాబు, రెడ్డయ్య, స్టేట్ రీసోర్స్ పర్సన్‌లు సుబ్బానాయుడు, గంగాధర్, తిరుమల కొండు, సురేష్‌కుమార్‌రెడ్డి, కృష్ణానాయక్, బాబా సాహెబ్ పాల్గొన్నారు.

సబ్సిడీ వేరుశనగ విత్తనాలు పంపిణీ



రైతులకు పంపిణీ చేస్తున్న డీఏఓ నాగేశ్వర్‌రావు

వీరపునాయునిపల్లె, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎస్.పాలగిరి రైతు సేవా కేంద్రంలో మంగళవారం జిల్లా వ్యవసాయ అధికారి (డీఏఓ) నాగేశ్వరరావు రైతులకు సబ్సిడీ వేరుశనగ విత్తనకాయలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేరుశనగ సాగుకు ప్రస్తుతం వాతావరణ పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయని తెలిపారు. ప్రతి రైతు తప్పకుండా విత్తనశుద్ధి చేయాలని సూచించారు. కమలాపురం సహాయ వ్యవసాయ సంచాలకులు నరసింహారెడ్డి మాట్లాడుతూ వేరుశనగ విత్తన 20-25 రోజుల లోపు గొర్రుతో అంతరకృషి చేసి మొక్కల మొదళ్లకు మట్టిని ఎగదోస్తే కలుపు నిర్మూ లనతో పాటు ఊడలు భూమిలోకి దిగి బాగా ఊరుతాయని తెలిపారు. మండలా ధ్యక్షుడు రఘునాథ్‌రెడ్డి మాట్లాడుతూ వాతావరణం సాగుకు అనుకూలంగా ఉన్నందున సకాలంలో విత్తనాలు, ఎరువులు అందించాలని కోరారు. ఏఓ శ్యామ్‌బాబు, వ్యవసాయ సహాయకులు సమరసింహారెడ్డి పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు కుంటలో పడి ఎద్దులు మృతి



మృతి చెందిన ఎద్దుల వద్ద విలపిస్తున్న రైతు


వీరపునాయునిపల్లె, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎలమకూరుపల్లె గ్రామానికి చెందిన సాంబశివారెడ్డి అనే రైతు ఇంటి వద్ద నుంచి ఉదయాన్నే ఎద్దుల బండితో సేద్యం చేసేందుకు బయలుదేరి వెళ్లాడు. వ్యవసాయ పొలంలో సేద్యం చేసి తిరిగి వస్తుండగా సమీపంలో ఉన్న కుంటలో ప్రమాదవశాత్తు పడిపోవడంతో అక్కడికక్కడే జత ఎద్దులు మృతి చెందాయి. కుటుంబ పోషణ కోసం దాదాపు రూ.2లక్షలు ఖర్చు చేసి జత ఎద్దులను కొనుగోలు చేశానని, ఎద్దులు చనిపోవడంతో జీవనాధారం కోల్పోయానని కన్నీటి పర్యంతమయ్యారు. బాధిత రైతును ఆదుకోవాలని స్థానికులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

కూలిన ఇల్లు... తప్పిన ప్రమాదం



కొండాపురం, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రామిరెడ్డిపల్లెలో మంగళవారం వెంకటరెడ్డి అనే రైతుకు చెందిన ఇల్లు కూలింది. ఇటీవల కురిసిన వర్షాలకు ఇల్లు నానడంతో కూలినట్లు బాధితుడు తెలిపారు. అదృష్టవశాత్తు మధ్యాహ్న సమయంలో ఇంట్లో ఎవరూ లేక పోవడంతో ప్రమాదం తప్పిందని బాధితుడు తెలిపారు. ప్రభుత్వం పక్కాగృహాన్ని మంజూరు చేసి ఆదుకోవాలని ఆయన కోరారు.

విద్యుత్ తీగ తెగి పడి గేదె మృతి



బి.కోడూరు, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని రెడ్డివారిపల్లెలో మంగళవారం రాత్రి విద్యుత్ వైరు తెగి పడటంతో షాక్‌కు గురై గేదె మృతి చెందింది. దాదాపు రూ.80వేలు చేసే గేదె మృతి చెందిందని బాధిత రైతు నాగిరెడ్డి వెంకటసుబ్బారెడ్డి వాపోయాడు. విద్యుత్ వైరు తెగి కింద పడిందని గ్రామస్థులు మున్నెల్లిలో ఉన్న సబ్‌స్టేషనుకు సమాచారం అందించినా అక్కడ పనిచేస్తున్న సిబ్బంది పొంతనలేని సమాధానం ఇస్తూ కరెంటు ఆఫ్ చేయలేదని గ్రామస్థులు ఆరోపించారు.

ఏడుగురు జూదరులు అరెస్టు

పులివెందుల, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): లింగాల మండలం అంబకపల్లెలో పేకాట నిర్వహిస్తున్నారనే సమాచారంతో పేకాట స్థావరంపై దాడి చేసి ఏడుగురు జూదరులను అరెస్టు చేసి రూ.5వేలకు పైగా నగదు స్వాధీనం చేసుకున్నామని రూర్ సీఐ ఎన్‌వీ రమణ తెలిపారు. మంగళవారం రాత్రి పులివెందుల రూరల్ స్టేషన్‌లో ఆయన మాట్లాడుతూ ఎస్పీ అశోక్ కుమార్ ఆదేశాలతో డీఎస్పీ మురళీనాయక్ సూచనలతో రూరల్ పరిధిలో ఉన్న గ్రామాలపై ప్రత్యేక నిఘా ఉంచామన్నారు. ప్రత్యేక టీములు ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు సమాచారాన్ని సేకరిస్తూ ఈ దాడులు చేశామన్నారు.

పొలంలో బయటపడ్డ వినాయక విగ్రహం



విగ్రహానికి పూజలు చేస్తున్న గ్రామ ప్రజలు

పెండ్లిమర్రి, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): తన వ్యవసాయ పొలంలో మంగళవారం ట్రాక్టర్‌తో ఓ రైతు సేద్యం చేస్తుండగా వినాయక విగ్రహం బయటపడింది. కొత్తగిరియంపల్లెకు చెందిన నడిపి సుబ్బారెడ్డి వెల్లటూరు పొలంలోని బేతాళ ఆంజనేయస్వామి గుడికి దగ్గరలోని తన వ్యవసాయ పొలంలో ట్రాక్టర్‌తో సేద్యం చేస్తుండగా వినాయక విగ్రహం బయట పడింది. ఈ విషయాన్ని గ్రామస్తులకు తెలపగా విగ్రహాన్ని బయటకు తీసి పూజలు నిర్వహించారు.

విద్యుత్‌ప్రమాదంపై సమగ్ర విచారణ చేయాలి

మదనపల్లె టౌన్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): బి.కొత్తకోట మండలంలో విద్యుత్ స్తంభం ఎక్కిన జేఎల్‌ఎం బాలకృష్ణ విద్యుదాఘాతానికి గురై కిందపడి గాయపడ్డారని, దీనిపై సమగ్ర విచారణ చేయించాలని సచివాలయం ఎనర్జీ అసిస్టెంట్ల సంఘం నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక ఎస్పీడీసీఎల్ ఈఈ కార్యాలయం వద్ద సీపీఐ నాయకుడు సాంబశివ ఆధ్వర్యంలో ఎనర్జీ అసిస్టెంట్లు నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ జేఎల్‌ఎంలు 33 కేవీ, 11 కేవీ విద్యుత్ స్తంభాలు ఎక్కడకూడదని నిబంధనలు ఉన్నా, కొంత మంది బాలకృష్ణను బలవంతంగా విద్యుత్ స్తంభం ఎక్కించారన్నారు. బెంగళూరులో చికిత్స పొందుతున్న బాలకృష్ణకు మెరుగైన వైద్యసేవలు అందించాలన్నారు. ఈ ప్రమాదానికి కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎనర్జీ అసిస్టెంట్ అసోసియేషన్ నాయకులు శ్రీనివాసులు, ముక్తియార్, కరుణాకర్, వినోద్, రామ్మోహన, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో వేలాంగణి మాత తిరుణాళ్లు



బండలాగుడు పోటీలు ప్రారంభిస్తున్న చెన్నుపల్లె సుబ్బారెడ్డి

బ్రహ్మంగారిమఠం, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలుగురాళ్లపల్లె గ్రామంలో వేళాంగణిమాత తిరుణాళ్ల మహోత్సవాలు వైభవంగా నిర్వహించారు. తిరుణాళ్ల సందర్భంగా రెండోరోజు మంగళవారం మండల టీడీపీ అధ్యక్షుడు చెన్నుపల్లి సుబ్బారెడ్డి బండలాగుడు పోటీలను ప్రారంభించారు. గెలుపొందిన వారికి మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ తరపున మొదటి బహుమతి కింద రూ.1,00,116, రెండో బహుమతి కాణాల మల్లికార్జునరెడ్డి రూ.70,116, మూడో బహుమతి రూ.50,116, శెట్టిపల్లె సుబ్బారెడ్డి, నాలుగో బహుమతి ఎత్తపు ఈశ్వర్‌రెడ్డి రూ.30116లు, ఐదో బహుమతి బసిరెడ్డి బాలదుగ్గిరెడ్డి రూ.20116 ఎడ్ల యజమానులకు అందించారు. తిరుణాళ్ల మహోత్సవాలకు జడ్పీ చైర్మన్ ముత్యాల రామ గోవిందురెడ్డి రూ.లక్షా 116లు కమిటీ సభ్యులకు అందించారు.

రోడ్డు పనులు పరిశీలించిన ఆర్డీవో

బ్రహ్మంగారిమఠం, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మల్లేపల్లె గ్రామంలో గ్రీన్‌ఫీల్డ్ హైవే, నేషనల్ హైవే రోడ్డు పనులను మంగళవారం రాజంపేట డివిజన్ ఆర్డీవో పరిశీలించారు. ఈసందర్భంగా అక్కడ పనిచేస్తున్న నేషనల్ హైవే జేఈలతో సిబ్బందితో సమావేశమై త్వరగా రోడ్డు పనులను త్వరితగతిన చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ తహసీల్దారు రాజనరసింహ నరేంద్ర, డిప్యూటీ తహసీల్దారు జాన్సన్, ఆర్‌అండ్‌బీ అధికారులు పాల్గొన్నారు.

అదుపుతప్పి కింద పడి యువకుడికి గాయాలు

మైదుకూరు రూరల్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : స్థానిక ప్రొద్దుటూరు రోడ్డులోని బంగ్లా వద్ద రోడ్డు మరమ్మతులు జరుగుతుండగా మోటర్‌సైకిల్‌పై వెళుతున్న సుబ్బు అనే యువకుడు అదుపుతప్పి కింద పడటంతో తీవ్రగాయాలయ్యాయి. యర్రగుంట్ల మండలంలోని కోగటం గ్రామానికి చెందిన వీడియో గ్రాఫర్ సుబ్బు పని మీద మైదుకూరుకు వచ్చి వెళుతుండగా ఈ సంఘటనట్లు స్థానికులు తెలిపారు. గాయపడిన వ్యక్తిని 108 వాహనంలో ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

పాపాఘ్ని నది తీరవాసుల కల నెరవేరింది

● గండికొవ్వూరు-వెన్నపల్లె మధ్యలో ప్రారంభమైన హైలెవల్ బ్రిడ్జి పనులు

చక్రాయపేట, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గండికొవ్వూరు-వెన్నపల్లె సమీపాన పాపాఘ్ని నదిపై హైలెవల్ బ్రిడ్జి మంజూరు కావడంతో పాపాఘ్ని నది తీరవాసుల కల నెరవేరింది. ఈ కాంట్రాక్టు పనులను సీఎం రమేష్ సోదరుడు సురేష్‌నాయుడు దక్కించుకున్నారు. పీఎంజీఎస్‌వై గ్రాంట్ కింద దాదాపు రూ.28కోట్లు మంజూరైనట్లు తెలిసింది. ఇక్కడ బ్రిడ్జి నిర్మించడంతో రెండు జిల్లాలను కలపడంతో పాటు పాపాఘ్ని నది తీరప్రాంతాలైన రాచుపల్లె, తక్కళ్లపల్లె, నక్కలదిన్నెపల్లె, మల్లప్పగారిపల్లె, సిద్దారెడ్డిగారిపల్లె, గడ్డంవారిపల్లె, కుమార్లకాల్వ, చెరువుకాంపల్లె, అద్దాలమర్రి తీరప్రాంతవాసుల కల నెరవేరింది. ఈ గ్రామాల ప్రజలు మండల కేంద్రానికి రావా లంటే దాదాపు 15 కిలో మీటర్లు తిరిగి రావాల్సి ఉంది. ఈ బ్రిడ్జి నిర్మించడంతో కేవలం రెండు కిలోమీటర్ల దూరంలో మండల కేంద్రానికి చేరవచ్చు. అంతేకాకుండా చక్రాయపేట నుంచి తలుపుల, కదిరి, అనంతపురం జిల్లా కేంద్రానికి వెళ్లేందుకు ఎంతో ఉపయోగపడుతుంది. పాపాఘ్ని తీరప్రాంతవాసులు పండించిన పంటలను మండల కేంద్రానికి, ఇతర ప్రాంతాలకు తరలించేందుకు ఎంతో సులువు కానుంది.

పాపాఘ్ని నదిలో బ్రిడ్జి నిర్మించడానికి యంత్రాలతో పనులు చేస్తున్న దృశ్యం





'విచారించి న్యాయం చేయండి'

కడప(వినాయకనగర్), జూన్3 (ఆంధ్రజ్యోతి): నగరంలోని శివానంద పురం ఇంటి నెంబర్ 88/113 గల ఇంటిపై కొంత మంది నాయకులు చేస్తున్న కుట్రలు, దౌర్జన్యాలపై రికార్డులు పరిశీలించి రెవెన్యూ, పోలీసు అధికారులు న్యాయం చేయాలని బాధితుడు చెన్నూరు బాలకుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. ఎంఆర్‌పీఎస్ నాయకులతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పురాతనం నుంచి ఇళ్లుకొన్నట్లు అన్ని రికార్డులు, ఆధారాలు తమ దగ్గర ఉన్నాయన్నారు. వాస్తు సరిలేదని పాత ఇంటిని పడగొట్టి కొత్త ఇంటిని నిర్మించుకుందామనుకుంటే కొంత మంది స్థానిక నాయకులు బెదిరిస్తున్నారని ఆరోపించారు. తమపై కక్ష కట్టి బెదిరిస్తున్నారని తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి విచారణ జరిపి న్యాయం చేయాలని కోరారు.

రాహుకాల దీప కాంతుల్లో విజయదుర్గాదేవి ఆలయం



కడప కల్చరల్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): రాహుకాల దీప కాంతులతో నగర బిల్టప్ సర్కిల్ సమీపంలో ఉన్న విజయదుర్గాదేవి ఆలయం దేదీప్యమానంగా ప్రకాశించింది. మంగళవారం కావడంతో రాయలసీమ నుంచి పలువురు మహిళా భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై అమ్మవారి సన్నిధిలో నిమ్మకాయలతో కూడిన రాహుకాల దీపాలను వెలిగించి పూజలు నిర్వహించారు. ఆ మేరకు మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకూ అత్యంత భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు.

రోడ్డుపై పారుతున్న మురుగు

సీకేదిన్నె, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన చింతకొమ్మదిన్నెలో మురుగు రోడ్డుపై పారుతూ ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తోంది. మండల కేంద్రంలోనే ఇటువంటి పరిస్థితి ఉంటే మిగతా పంచాయతీల పరిస్థితి ఏమిటని ప్రజలు చర్చించుకుంటున్నారు. మురుగునీరు పారేందుకు కాలువలు ఉన్నప్పటికి ఆ కాలువల్లో మురుగునీరు పోక చెత్తాచెదారం పేరుకుపోవడంతో మురుగు రోడ్డుపై పారుతోంది. సమీపంలోనే అంగన్వాడీ స్కూలు ఉండడంతో చిన్నపిల్లలు మురుగునీటిలోనే రావాల్సి వస్తోందని వారు తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అదే విధంగా కాలువ సమీపంలో ప్రాథమిక పాఠశాల ఉండడంతో బడి తెరిస్తే పిల్లల పరిస్థితి ఎలా ఉంటుందోనని మురుగునీటిలో నడవాల్సి వస్తుందని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అయితే మండలస్థాయి అధికారులు ఉన్నప్పటికీ అటు అధికారులు, ప్రజాప్రతినిధులు కానీ పట్టించుకోవడంలేదని స్థానికులు వాపోతున్నారు.



రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగునీరు

● పట్టించుకోని అధికారులు - నాగరాజు, చింతకొమ్మదిన్నె

మండల కేంద్రమైన చింతకొమ్మదిన్నెలో మురుగు రోడ్డుపై పారుతున్నప్పటికి ఎవరు పట్టించుకోవడంలేదు. అధికారులకు చెప్పినప్పటికి చూస్తాం, చేస్తామంటూ గత రెండు నెలలుగా దాట వేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు పట్టించుకుని మురుగు రోడ్డుపై రాకుండా చూడాలి.

● పట్టించుకోని ప్రజాప్రతినిధులు - గంగులయ్య, చింతకొమ్మదిన్నె

మురుగు రోడ్డుపై పారుతున్నప్పటికి ప్రజాప్రతినిధులు, అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. సమస్య వారి దృష్టికి పోయినప్పటికి పరిష్కారం కాలేదు. ఎన్నికలప్పుడు మాత్రమే ప్రజలు వారికి కనిపిస్తారు. ఇప్పటికైనా రోడ్డుపై రాకుండా చేసి ప్రజల ఇబ్బందులు తొలగించాలి.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

పులివెందుల రూరల్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పలు ప్రాంతాలలో బుధవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ ఏఈఈ జగదీశ్వర్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 33/11కేవీ కోతి సమాధి సబ్‌స్టేషన్ పరిధిలో సబ్‌స్టేషన్ మెయింటెనెన్స్ ఉన్న కారణంగా ఆయా ప్రాంతాలలో బుధవారం సాయంత్రం 3 నుంచి 4.30గంటల వరకు అంతరాయం కలుగుతుందన్నారు.

ఉచిత యోగ శిక్షణ

కడప ఎర్రముక్కపల్లె, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): కడపనగరం బాలాజీనగర్ ఎస్‌వీ ఇంజనీరింగ్ కళాశాలలో ఈనెల 13వ తేదీ నుంచి ఉచిత యోగ శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు లయన్స్ క్లబ్ ఆఫ్ కడప,అన్నమయ్య ప్రెసిడెంట్ అనంతబొట్ల వెంకటసుబ్బయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతిరోజు ఉదయం 5.30గంటల నుంచి 7గంటల వరకు ఈ శిక్షణ ఉంటుందన్నారు. ప్రముఖ యోగా నిపుణుడు డాక్టర్ ఆర్.రంగనాథరెడ్డి శిక్షణ ఇస్తారన్నారు. ఆసక్తి గల వారు క్యాంప్ కో-ఆర్డినేటర్ కె.రాఘవేంద్రవర్మ 9885586825 నెంబరును సంప్రదించాలని సూచించారు.

8వ తరగతి విద్యార్థినులకు ఉచిత విద్య

కడప మారుతీనగర్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో ఏడో తరగతి ముగించుకుని ఎనిమిదో తరగతిలో ప్రవేశించే గ్రామీణ ప్రాంత రెడ్డి సామాజిక వర్గానికి చెందిన ప్రతిభావంతులైన విద్యార్థినులకు ఉచిత విద్యను అందించనున్నట్లు కడప రెడ్డి సేవా సమితి నాయకులు మూల మల్లికార్జునరెడ్డి, లెక్కల కొండారెడ్డి వెల్లడించారు. మంగళవారం స్థానిక రాజీవ్ పార్క్ రెడ్డి సేవా సమితి కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతిభావంతులైన విద్యార్థినులకు తమ హాస్టల్‌లో వసతి కల్పించడంతో పాటు పాఠశాలలో చేర్పించి విద్యకు సహకారం అందించడం జరుగుతుందన్నారు. అర్హత కలిగిన వారు 8వ తరగతిలో ప్రవేశానికి ఈనెల 15వ తేదీ లోగా నగర రాజీవ్ మార్గ్ రెడ్డిసేవాసమితి కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించాలని కోరారు. వచ్చిన దరఖాస్తులను పరిశీలించి 7వ తరగతి సిలబస్ ప్రకారంగా వారికి పరీక్షలు నిర్వహించి ప్రతిభతో పాటుగా నడవడికను సైతం పరిశీలించి ఎంపిక చేసి వారి విద్య పూర్తిఅయ్యేవరకూ సమితి బాధ్యత తీసుకుంటుందన్నారు. ఏదేని ఇతర వివరాలకు 9440523484, 9440651284 అనే నెంబర్లను సంప్రదించాలన్నారు. సమావేశంలో సమితి నాయకులు నాగిరెడ్డి, జిల్లా రెడ్డి జనసంఘం అధ్యక్షుడు సుబ్బిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సోదరభావంతో పండుగలు నిర్వహించుకోవాలి

కడప క్రైం, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : ప్రతి ఒక్కరూ సోదరభావంతో పండుగలు నిర్వహించుకోవాలని అన్ని మతాలు సమానమంటూ కడప డీఎస్పీ వెంకటేశ్వర్లు అన్నారు. కడప టూటౌన్ పోలీసుస్టేషన్‌లో మంగళవారం పీస్ కమిటీ సభ్యులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పండుగలు సోదరభావంతో నిర్వహించుకోవాలని ఎవరు కూడా గొడవలకు దిగకూడదని సూచించారు. ఈ కార్యక్రమంలో టూటౌన్ సీఐ నాగార్జున, ఎస్‌ఐలు హుస్సేన్, సిద్దయ్య, పీస్ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు తక్షణమే విడుదల చేయాలి

కడప సెవెన్ రోడ్స్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాల్లో (కేజీబీవీ) 2024 నవంబరు 1 ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో 47మంది విధులు నిర్వర్తిస్తున్న నాన్ టీచింగ్ సిబ్బందికి ఏడు నెలలుగా వేతనాలు విడుదలచేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగసుబ్బారెడ్డి ప్రకటనలో కోరారు. నిధులు ఉన్న సర్వశిక్షఅభియాన్ అధికారుల నిర్లక్ష్యం మూలంగానే అందడం లేదని ఆయన ఆరోపించారు. ఆందోళన చేయకముందే పెండింగ్ వేతనాలు తక్షణమే ఇవ్వాలని డిమాండ్ చేశారు.

ఆశాల హామీలకు జీవోలివ్వాలి



వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం

కడప మారుతీనగర్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): ఆశాలకు పెండింగ్‌లో వున్న లెప్రసీ అలవెన్స్‌ను తక్షణమే చెల్లించడంతో పాటుగా కూటమి ప్రభుత్వం ఆశాలకు ప్రకటించిన వాటికి జీవోలు ఇవ్వాలని ఏ.పీ ఆశావర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు గుంటి వేణుగోపాల్ డిమాండ్ చేశారు. ఇందుకు నిరసనగా ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా సమితి పిలుపు మేరకు అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో సంబంధిత మెడికల్ ఆఫీసర్లకు వినతిపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకురాళ్లు సుజాత, రాజేశ్వరి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు ఎఫ్ఏసీ ప్రిన్సిపాల్‌గా నాగేంద్ర

వేంపల్లె, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): వేంపల్లె ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు ఎఫ్ఏసీ ప్రిన్సిపాల్‌గా ఎస్.నాగేంద్ర నియమితులయ్యారు. ఈ మేరకు మంగళవారం హయ్యర్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ డాక్టర్ నారాయణ భరత్‌గుప్త ఉత్తర్వులు జారీ చేశారు. కళాశాల ప్రిన్సిపాల్‌గా ఉన్న డాక్టర్ యోగాంజనేయులు పదవీ విరమణ చెందగా ఆయన స్థానంలో ఇదే కళాశాలలో వైస్ ప్రిన్సిపాల్‌గా ఉన్న నాగేంద్రకు పూర్తి అదనపు బాధ్యతలను అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

ఉనికిని కాపాడుకునేందుకే వైసీపీ కొత్త నాటకం



మాట్లాడుతున్న టీడీపీ నాయకుడు శంకర్

కడప ఎర్రముక్కపల్లె, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఘోర పరాజయం పొందిన వైసీపీ తన ఉనికిని కాపాడుకునేందుకు కొత్త డ్రామాలకు తెరలేపిందని టీడీపీ నాయకుడు చవలముడి శంకర్ తెలిపారు. మంగళవారం కడపనగరం 26వ డివిజన్ టీడీపీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ కుంభకోణాల నుంచి ప్రజా దృష్టి మళ్లించడానికి ధర్నాల డ్రామా ఆడుతున్న జగన్ ముఠా వారి ప్రభుత్వంలో తొలి ఏడాదిలో కనీసం పదిశాతం హామీలు కూడా అమలు చేయలేదని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో మాజీ జీపీ గడ్డ గుర్రప్ప, ఎస్సీసెల్ రాష్ట్ర అధికారప్రతినిధి గొడుగునూరు రాజశేఖర్, టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాసాపేట శివ, కడప ఎస్సీ సెల్‌నగర ప్రధాన కార్యదర్శి రాయుడు, టీఎన్ఎస్ఎఫ్ కడప అధ్యక్షుడు అనిల్,ఎస్సీ సెల్ నాయకుడు వీరయ్య పాల్గొన్నారు.

సింహాద్రిపురంలో సీసీ కెమెరాల నిఘా - ఎస్ఐ



సింహాద్రిపురం, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): సింహాద్రిపురం పట్టణంలో సీసీ కెమెరాలతో నిఘా ఏర్పాటు చేసినట్లు ఎస్ ఐ రవికుమార్ తెలి పారు. మంగళవారం సింహాద్రిపురం బస్టాండు సర్కిల్‌లో సీసీ కెమెరాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఏదైనా దొంగతనం లాంటి విషయాలు జరిగితే పోలీస్‌స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేయాలన్నారు. పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు కూటమి సుపరిపాలనపై ప్రత్యేక కార్యక్రమం

కడప మారుతీనగర్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వైసీపీ అరాచక పాలన పీడ విరగడై...కూటమి సుపరిపాలన మొదలై సరిగ్గా ఏడాది (సంవత్సరం) పూర్తి చేసుకోనున్న సందర్భాన్ని పురస్కరించుకుని జనసేనపార్టీ కేంద్ర కార్యాలయం పిలుపుమేరకు ఈనెల 4వ తేదీ బుధవారం నగర దేవునికడప లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద ప్రత్యేక కార్యక్రమాలు అట్టహాసంగా నిర్వహిస్తున్నట్లు జనసేన పార్టీ జిల్లా నాయకుడు జి.వి. రమణ వెల్లడించారు. ఆ మేరకు ఉదయం 8 గంటలకు మహిళలకు ఆలయం వద్ద రంగవల్లుల పోటీలు జరుగనున్నట్లు తెలిపారు. ఇందులో విజేతలైన వారికి బహుమతులు అందజేస్తామన్నారు. మంగళవారం జనసేనపార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో పార్టీ నాయకులు పాల్గొన్నారు.

రిమాండ్‌లో ఉన్న వారికి ఎంపీ పరామర్శ

పులివెందుల, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): పులివెందుల సబ్‌జైలులో రిమాండ్‌లో ఉన్న పలువురు వైసీపీ నేతలను కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి మంగళవారం పరామర్శించారు.ఇటీవల టీడీపీ జెండాలను, ఫ్లెక్సీలను ధ్వంసం చేసిన ఘటనలో వైసీపీ నేతలపై పులివెందుల పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. దీనితో పలువురిని పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ నేపథ్యంలో అనుమతులు అనంతరం ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి రిమాండ్‌లో ఉన్న వారిని పరామర్శించారు.

జిల్లా క్రెడిట్ ప్లాన్ లక్ష్యం రూ.17940 కోట్లు

కడప, కలెక్టరేట్, జూన్3 (ఆంధ్రజ్యోతి): వన్‌ఫ్యామిలీ-వన్‌ఎంటర్‌ప్రెన్యూర్‌గా అభివృద్ధి చెందేందుకు అవసరమైన పెట్టుబడుల కోసం స్వయం సహాయక సంఘాలకు రుణ సహకారం అందించాలని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి బ్యాంకు అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో కలెక్టర్ అధ్యక్షతన డిస్ట్రిక్ట్ కన్సలేటివ్ కమిటీ (డీసీసీ) డిస్ట్రిక్ట్ లెవల్ రివ్యూ కమిటీ (డీఎల్ఆర్సీ) బ్యాంకర్ల సమావేశం నిర్వహించారు. ఈసమావేశంలో బ్యాంకు అధికారులు,జిల్లా అధికారులు పాల్గొన్నారు.

'వెన్నుపోటు దినం కాదు వైసీపీకి తద్దినం పెట్టిన దినం'

పెండ్లిమర్రి, జూన్ 3 (ఆంధ్రజ్యోతి):వైసీపీ బుధవారం చేస్తున్నది వెన్న పోటు దినం కాదని ఆ పార్టీకి టీడీపీ తద్దినం పెట్టిన దినం అని మండల టీడీపీ అధ్యక్షుడు గంగిరెడ్డి పేర్కొన్నారు.మండల కేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో పార్టీ నాయకులతో కలసి మాట్లాడుతూ వైసీపీ నాయకులను ఇళ్లకు పంపిన దినంగా పేరు పెట్టుకొని జరుపు కోవాలని,ప్రజలు ఛీ కొట్టినా సిగ్గూఎగ్గూ లేకుండా ప్రజల వద్దకు పోవాలనే ఉద్దేశ్యంతో ఏదో ఒక కార్యక్రమం ఏర్పాటు చేసుకోవడం సిగ్గు చేటన్నారు. ప్రభుత్వంపై బురద చల్లడం మాని ఇళ్ల వద్ద ప్రశాంతంగా కూర్చొంటే బాగుంటుందన్నారు.సమావేశంలో టీడీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

శక్తియాప్ సేవలు వినియోగించుకోవాలి



అవగాహన కల్పిస్తున్న దృశ్యం

కడప క్రైం, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : శక్తియాప్ బాలికలకు రక్షణ గా ఆపద సమయంలో ఎంతగానో ఉపయోగపడుతుందని శక్తి టీం మహిళా ఎస్ఐ శాంతమ్మ అన్నారు. శక్తి యాప్ ఆవశ్యకత, ప్రాధాన్యతగురించి మంగళవారం కడప నగరంలోని బిల్టప్ వద్ద ఉన్న శ్రీ చైతన్య స్కూలు ఉపాధ్యాయులు, సిబ్బందికి శక్తి టీం మహిళా ఎస్ఐ శాంతమ్మ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్రప్రభుత్వం మహిళల భద్రత, రక్షణ కోసం అందుబాటులోకి తీసుకువచ్చిన శక్తి యాప్ ఉపయోగం, సేవలు, నిక్షిప్తం, రిజిస్ట్రేషన్ గురించి జిల్లాలో ప్రతి మహిళ, బాలికలకు, విద్యార్థులకు విస్తృత స్థాయిలో అవగాహన కల్పిస్తున్నారు. ప్రతి మహిళ, విద్యార్థులు, బాలికలు సెల్‌ఫోనులో ప్లేస్టోరులో ఈ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని వ్యక్తిగత వివరాలు ఫోను నంబర్లతో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో చైతన్య స్కూలు ప్రిన్సిపాల్ ఎం.శ్రీదేవి, సిబ్బంది పాల్గొన్నారు.

వంట ఏజెన్సీ నిర్వాహకులకు వంట పోటీలు



బహుమతులు అందిస్తున్న దృశ్యం

వేంపల్లె, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): వేంపల్లె ఎంఈఓ స్టాలిన్ ఆధ్వర్యంలో వంట ఏజెన్సీ నిర్వాహకలుకు వంటల పోటీలు నిర్వహించారు. మండలంలోని వంట ఏజెన్సీలకు శిక్షణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వంటల పోటీలు నిర్వహించి రుచిగా వండిన ఏజెన్సీ నిర్వాహకులకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ప్రతాప్‌రెడ్డి తదితరులుపాల్గొన్నారు.

నారేపల్లెలో మేలుకొలుపు



మాట్లాడుతున్న సీఐ ఉలసయ్య

వేముల, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నారేపల్లెలో పోలీస్ కళాజాగృతి బృందంచే మేలుకొలుపు కార్యక్రమం మంగళవారం రాత్రి నిర్వహించారు. డీఎస్పీ మురళీనాయక్ ఆధ్వర్యంలో ఆర్కేవ్యాలీ సీఐ ఉలసయ్య, వేముల ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ మేలు కొలుపు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాజాగృతి బృందం, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులు, దివ్యాంగులకు ఇంటి వద్దకే రేషన్

చక్రాయపేట, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): తహసీల్దార్ విజయకుమారి ఆధ్వర్యంలో మంగళవారం 65 సంవత్సరాలు దాటిన వృద్ధుల ఇంటి వద్దకే బియ్యం పంపిణీ చేశారు. వృద్ధులతో పాటు వికలాంగులకు ఇళ్ల వద్దకే వెళ్లి పంపిణీ చేస్తున్నారు. మండలంలో దాదాపు 170 వికలాంగులు,వృద్ధులుఉన్నారని, వారికి ఇంటింటికి అందిస్తున్నట్లు తహసీల్దార్ విజయకుమారి తెలిపారు.

సింహాద్రిపురం..: మండలంలో అన్ని పంచాయతీల్లో ప్రజలకు సకాలంలో రేషన్ బియ్యం అందించాలని తహసీల్దార్ వెంకట సాయినాథరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం బలపనూరు, అంకాళమ్మగూడూరు, కోవరంగుట్టపల్లి గ్రామాల్లో రేషన్ పంపిణీ చేస్తున్న కార్యక్రమాన్ని పరిశీలించారు. అనంతరం వృద్ధులు, వికలాంగులకు ఇంటి వద్దకే వెళ్లి రేషన్ పంపిణీపై తహసీల్దార్ ఆరా తీశారు. వృద్ధులకు తహసీల్దార్ రేషన్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో వీఆర్వో, లబ్ధిదారులు పాల్గొన్నారు.

వేముల..: వృద్ధులకు, దివ్యాంగులకు, అస్వస్థతతో బాధపడుతున్న వారికి నిత్యావసర సరుకులు ఇంటి వద్దకే డీలర్లు పంపిణీ చేస్తారని తహసీల్దార్ ఇందిరా రాణి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వీరికి ప్రతినెల 1 నుంచి 5వ తేదీ వరకు మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 4గంటల వరకు ఎఫ్‌పి షాప్ డీలర్లు వారి ఇంటి వద్దకే నిత్యావసర సరుకులు అందించడం జరుగుతుందని తెలిపారు.

పులివెందుల రూరల్..: పులివెందుల పరిధిలో 65ఏళ్లకు పైబడిన వయోవృద్ధులకు, వికలాంగులకు, అనారోగ్యంతో మంచంపై ఉన్న వారికి మంగళవారం తహసీల్దార్ నజీర్ అహ్మద్ నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. తహసీల్దార్ మాట్లాడుతూ ప్రతినెలా 1 నుంచి 5వ తేదీ వరకు వీరికి ఇంటి వద్దకే వెళ్లి నిత్యావసర సరుకులు అందించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ, డీలర్ పాల్గొన్నారు.

వేంపల్లె..: వేంపల్లెలో వృద్ధులకు, వికలాంగులకు ఇంటిద్దకే రేషన్ పంపిణీ చేపట్టారు. తహసీల్దార్ హరినాథ్‌రెడ్డి సూచన మేరకు ఆర్ఐ లోకేష్, వీఆర్ఓలు మంగళవారం 8వ రేషన్ షాపు ఎలీష,ఈశ్వరయ్య ద్వారా ఇంటివద్దకెళ్లి రేషన్ బియ్యాన్ని అందించారు. ప్రజలకు ఎలాంటి అసౌకర్యాలు జరగకుండా 1 నుంచి 15వ తేదీ వరకు రేషన్‌షాపులు ఉంటాయని తెలిపారు.





పులివెందుల, వేంపల్లిలో వృద్ధుల ఇంటి వద్దకెళ్లి రేషన్ అందిస్తున్న రెవెన్యూ అధికారులు, డీలర్లు

యోగాతో మానసిక ప్రశాంతత

దువ్వూరు, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): యోగా చేయడం వలన మానసిక ప్రశాంతత చేకూరుతుందని సురేష్‌బాబు తెలిపారు. దువ్వూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం ఆశా కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. యోగాపై ఆసక్తి కలిగేలా ప్రోత్సహించాలని సూచించారు. కార్యక్రమంలో మహిళా వైద్యులు వికసిత, హేమలత, సిబ్బంది పాల్గొన్నారు.







రేషన్ అక్రమాలకు చెక్

● పటిష్టమైన చర్యలు చేపట్టినట్లు ఆర్డీవో సాయిశ్రీ వెల్లడి ● పలు మండలాల్లో రేషన్ దుకాణాలను తనిఖీ చేసిన అధికారులు


జమ్మలమడుగు కన్నెలూరులోని రేషన్‌షాపును తనిఖీ చేసి స్థానికులతో మాట్లాడిన ఆర్డీవో సాయిశ్రీ


బ్రహ్మంగారిమఠంలోని సోమిరెడ్డిపల్లె -1 రేషన్‌షాపును తనిఖీ చేస్తున్న ఆర్డీవో చంద్రమోహన్

జమ్మలమడుగు, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం రేషన్‌షాపుల్లో అక్రమాలకు చెక్ పెడుతూ జూన్ 1వ తేదీ నుంచి రేషన్ బియ్యం పంపిణీకి చర్యలు చేపట్టినట్లు జమ్మలమడుగు ఆర్డీవో సాయిశ్రీ పేర్కొన్నారు. ప్రభుత్వం రేషన్ షాపుల ను తిరిగి ప్రారంభించి నేరుగా బియ్యం పంపిణీకి శ్రీకారం చుట్టిందని ఆర్డీవో తెలిపారు. జమ్మలమడుగు మున్సిపాలిటీ పరిధిలోని కన్నెలూరు గ్రామంలో 9, 10 వార్డులకు సంబంధించిన రేషన్ దుకాణాలను ఆర్డీవో సాయిశ్రీ, తహసీల్దారు శ్రీనివాసరెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. గతంలో చౌక దుకాణాల్లో తూకాలు తక్కువగా ఇస్తున్నారని అక్రమాలు జరుగుతున్నాయని ఆరోపణలుండేవని ప్రభుత్వం అలాంటి వాటిని నియంత్రించేందుకు గట్టి చర్యలు చేపట్టినట్లు ఆర్డీవో తెలిపారు. అక్కడున్న రేషన్ షాపు వద్ద స్థానికులతో ఆర్డీవో మాట్లాడి తూకాలు సక్రమంగా ఉన్నాయా, ఏయే వస్తువులకు ధరలు ఎంత తీసుకుంటున్నారు, ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. అలాగే 65 సంవత్సరాలు దాటిన వృద్ధులకు, దివ్యాంగులకు ఇంటి వద్ద రేషన్ పంపిణీ చేస్తారని ఆర్డీవో తెలిపారు.

మైలవరంలో: రేషన్‌షాపుల్లో ప్రభుత్వం కేటాయించిన ధరలకే లబ్ధిదారులకు సరుకులు పంపిణీ చేయాలని జమ్మలమడుగు ఆర్డీవో సాయిశ్రీ పేర్కొన్నారు. మంగళవారం మండల పరిధిలోని దొమ్మరనంద్యాల గ్రామంలో రేషన్‌షాపును తనిఖీ చేసి గ్రామంలో 65 ఏళ్ల పైబడిన వృద్ధులకు, దివ్యాంగులకు ఇంటి వద్దకు వెళ్లి రేషన్ బియ్యాన్ని ఆర్డీవో పంపిణీ చేశారు. తహసీల్దారు లక్ష్మినారాయణ పాల్గొన్నారు.

బ్రహ్మంగారిమఠంలో: బ్రహ్మంగారిమఠం మండలంలో 16 రేషన్‌షాపులను మంగళవారం రాజంపేట డివిజన్ ఆర్డీవో చంద్రమోహన్, తహసీల్దారు రాజనరసింహ నరేంద్ర, డిప్యూటీ తహసీల్దారు జాన్సన్ పరిశీలించారు. బి.మఠం-1, పెద్దిరాజుపల్లె, సొదరివారిపల్లె, తోట్లపల్లె, దిరసవంచ, నాగిశెట్టిపల్లె గ్రామాల్లోని రేషన్‌షాపును పరిశీలించి అక్కడ ప్రజలకు నిత్యావసర వస్తువులు ఏవిధంగా పంపిణీ చేస్తున్నారని పరిశీలించారు.

చాపాడులో: మండలంలోని పలు గ్రామాల్లో ఉన్న ప్రభుత్వ చౌక దుకాణాలను తహసీల్దారు రమాకుమారి, డిప్యూటీ తహసీల్దారు కృష్ణారెడ్డి, ఆర్ఐ శివశంకర్‌రెడ్డి మంగళవారం తనిఖీచేశారు. అల్లాడుపల్లె, పల్లెవోలు, ఖాదర్‌పల్లె, భద్రిపల్లె, సోమాపురం, పెద్దగురవలూరు, చిన్నగురవలూరు, అనంతపురం, అయ్యవారిపల్లె తదితర గ్రామాల్లోని రేషన్‌షాపులను వారు పరిశీలించారు. 65 సంవత్సరాలు పైబడిన వృద్ధులకు, దివ్యాంగులకు మధ్యాహ్నం 12 గంటల నుంచి 3 గంటలలోపు వారి ఇంటి వద్దకు వెళ్లి డీలర్లు బియ్యం అందజేశారు. 15వ తేదీలోపు నిత్యావసర సరుకులు పంపిణీ చేయాలని అధికారులు సూచించారు.

ఖాజీపేటలో: మండలంలోని భూమాయపల్లె పంచాయతీ పరిధిలోని ముత్తలూరుపాడు రేషన్‌షాపులో సర్పంచ్ వెంకటసుబ్బయ్య లబ్ధిదారులకు రేషన్ బియ్యం మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అక్రమ రవాణా అరికట్టేందుకే చౌక దుకాణాల్లో ప్రజలకు అందిస్తుందన్నారు.

పోరుమామిళ్లలో : పోరుమామిళ్లలోని 2వ షాపు డీలర్ అల్లారయ్య మంగళవారం బియ్యం అందజేశారు. తన డీలరుషిప్ పరిధిలో 60 ఏళ్లుదాటిన రేషన్ లబ్ధిదారుల ఇంటి వద్దకే వెళ్లి సరుకుల కోసం వేలి ముద్రలు వేయించుకుని వారికి రేషన్ అందేలా చేశారు. కార్యక్రమంలో వీఆర్వో వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు పంపిణీ

ఎర్రగుంట్ల, జూన్ 3(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను ఎర్రగుంట్ల ఎన్డీయే కూటమి ఇన్‌చార్జి మధుసూధన్‌రెడ్డి మంగళవారం పంపిణీచేశారు. ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, టీడీపీ ఇన్‌చార్జి సి.భూపేష్ రెడ్డి ఆదేశాలతో ఈ చెక్కులను పంపిణీచేశారు. లబ్దిదారులకు రూ.4,52,000లను ఆయన టీడీపీ కార్యాలయంలో అందజేశారు. అనారోగ్యంతో బాధపడుతున్న వారికి ఈ చెక్కులు కొండంత అండగా ఉంటాయని మధుసూధన్‌రెడ్డి పేర్కొన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల, టౌన్ అధ్యక్షులు సంజీవరెడ్డి, ఎం.మోహన్‌రెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

వీరజవాన్‌కు సత్కారం

దువ్వూరు, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): ఇటీవల జరిగిన భారత్-పాక్ యుద్ధంలో పాల్గొన్న దువ్వూరుకు చెందిన వీరజవాన్‌ను న్యాయవాదులు మంగళవారం సత్కరించారు. దువ్వూరుకు చెందిన అడ్వకేట్ ఇమామ్‌బాష కుమారుడు మహమ్మద్‌రఫి సొంత గ్రామానికి వచ్చారు. స్థానికంగా ఉంటున్న మైదుకూరు బార్ ప్రెసిడెంట్ అడ్వకేట్ సోమేసుల శివప్రసాద్, లాయర్ యశ్వంత్‌రాయల్, మాజీ సైనికుడు రామచంద్రుడు, మరికొందరు స్థానికులు కలిసి మహమ్మద్‌రఫికి శాలువా కప్పి సత్కరించారు. ఈ సందర్భంగా జవాన్ తల్లిదండ్రులు హర్షం వెలిబుచ్చారు.

బక్రీద్‌ను శాంతియుతంగా జరుపుకోవాలి

కొండాపురం, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): బక్రీద్ పండుగను శాంతియుతంగా జరుపుకోవాలని సీఐ మహమ్మద్‌రఫీ, ఎస్సై ప్రతాప్‌రెడ్డిలు తెలిపారు. మంగళవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో శాంతికమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించి శనివారం జరిగే బక్రీద్ పండుగను ఎటువంటి విద్వేషాలు లేకుండా సామరస్యంగా సోదరభావంతో జరుపుకోవాలని ముస్లిం మత పెద్దలకు సూచించారు.

వివరాలు నమోదు చేయండి

బద్వేలు రూరల్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : ఆశాలు గర్భిణులు, పిల్లల వివరాలను నమోదు చేయాలని తొట్టిగారిపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి జె.వినయ్‌కుమార్ కోరారు. మంగళవారం నిర్వహించిన ఆశా కార్యకర్తల సమావేశంలో ఆయన మాతృశిశు సంరక్షణ సీజనల్ వ్యాధులపైన అవగాహన కల్పించారు. సబ్ యూనిట్ ఆఫీసరు నరసింహా రెడ్డి, హెల్త్ ఎడ్యుకేటరు పాల్గొన్నారు.

జాబ్‌కార్డులు అందజేసిన అధికారులు


జాబ్‌కార్డులు అందుకున్న ఎస్.ఉప్పలపాడు ఎస్సీ కాలనీవాసులు

జమ్మలమడుగు, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు ఎస్.ఉప్పలపాడు గ్రామానికి చెందిన ఎస్సీ కాలనీవాసులు మంగళవారం జాబ్ కార్డులు అందుకున్నట్లు తెలిపారు. 'ఆంధ్రజ్యోతి' దినపత్రికల్లో 'జిల్లా కలెక్టర్ ఆదేశాలు బేఖాతర్ జాబ్‌కార్డుల్లో నిర్లక్ష్యం' అన్న కథనం ప్రచురితమైంది. వెంటనే జిల్లా అధికారులు స్థానిక సిబ్బందికి గట్టి ఆదేశాలు ఇచ్చినట్లు తెలిసింది. వెంటనే ఎస్సీ కాలనీలో జిల్లా కలెక్టర్ చెరుకూరి శ్రీధర్‌కు జాబ్‌కార్డుల విషయంలో సమస్య ఉందని, చెప్పినవారిని పిలిపించి వారికి ఆగమేఘాలపై జాబ్‌కార్డులు అందించారు. బుధవారం నుంచి ఎస్.ఉప్పలపాడు గ్రామంలో ఉపాధి హామీ పనులకు వెళ్లవచ్చని బాధితులందరికి జాబ్ కార్డులు అందించినట్లు కడప డ్వామా పీడీ ఆదిశేషారెడ్డి 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. అందులో ఎస్.ఉప్పలపాడు గ్రామంలో కలెక్టర్‌కు చెప్పినవారే కాకుండా మొత్తం అయిదుగురికి జాబ్‌కార్డులు ఇచ్చినట్లు ఆయన తెలిపారు. లంక మేరీ, బత్తల సాలమ్మ, బత్తల మేరమ్మ, కొమ్మగాండ్ల జయమ్మ లంకా మేరీ, అనే అయిదుగురికి జాబ్‌కార్డులు ఇచ్చినట్లు వారికి వెంటనే పని కల్పిస్తామని బుధవారం ఉదయం నుంచి వారు పనిలో వెళ్లవచ్చని స్థానిక అధికారులకు ఆదేశించినట్లు జిల్లా అధికారి తెలిపారు.

పరిసరాల పరిశుభ్రతతోనే అంటువ్యాధులు దూరం


సమావేశంలో మాట్లాడుతున్న వైద్యాధికారి డాక్టర్ శ్రీనివాస్

ప్రొద్దుటూరు రూరల్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): వ్యక్తి గత పరిశుభ్రతతో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడం వలన డయేరియా, మలేరియా వంటి వ్యాధులు దరిచేరవని కామనూరు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ శ్రీనివాస్ పేర్కొన్నారు. మంగళవారం ఆశాడే సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ చిన్న పిల్లలు అతిసార వ్యాధి బారిన పడకుండా తీసుకోవలసిన జాగ్రత్తలు, మలేరియా జ్వరాలు ప్రబల కుండా చేపట్టవలసిన చర్యలను వివరించారు. సీహెచ్‌వో కృష్ణమ్మ, సూపర్‌వైజర్ వరప్రసాద్, ఏఎన్‌ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

జమ్మలమడుగులో: మలేరియా నివారణ మాసోత్సవం 2025 గురించి అవగాహన పెంచడానికి కన్నెలూరు, మోరగుడి, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల డాక్టర్లు, సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. మంగళవారం మలేరియా నివారణ మాసోత్సవం గురించి వైద్యాధికారులు మాట్లాడుతూ మలేరియాకు వ్యతిరేకంగా పోరాటం చేయాలన్నారు. ఈ కార్యక్రమాన్ని పురష్కరించుకుని జమ్మలమడుగులోని పీహెచ్‌సీ, యూపీహెచ్‌సీ, కేంద్రాల్లో అవగాహన, సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు, పర్యవేక్షక సిబ్బంది, ఆశా కార్యకర్తలు, క్షేత్ర సిబ్బంది పాల్గొన్నారు.

బ్రహ్మంగారి వ్యవసాయ భూముల్లో కంపచెట్లు తొలగింపు

బ్రహ్మంగారిమఠం, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : కాలజ్ఞాన కర్త మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి దేవస్థానం పరిధిలోని వ్యవసాయ పొలాల్లో కంపచెట్లు దేవస్థానం ఫిట్‌పర్సన్ సి.శంకరబాలాజీ ఆధ్వర్యంలో మంగళవారం తొలగించారు. కొత్తూరు గ్రామ ప్రాంతంలో 12 ఎకరాల వ్యవసాయ పొలంలో ఉన్నటువంటి కంపచెట్లను ఎక్స్‌కవేటరుతో తొలగించే కార్యక్మరం చేపట్టారు. కార్యక్రమంలో దేవస్థానం మేనేజరు ఈశ్వరయ్యాచారి, పూజా శివాయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయ అధికారులకు ఘనసన్మానం



జమ్మలమడుగు, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు ప్రభుత్వ శాఖా గ్రంథాలయంలో మంగళవారం గ్రంథాలయ అధికారులను ఘనంగా సన్మానించారు. ఇక్కడ పనిచేస్తున్న లైబ్రేరియన్ జింకా చంద్రశేఖర్ కమలాపురంకు బదిలీ కాగా కడపలో పనిచేస్తున్న నాదేండ్ల బాబ్జి జమ్మలమడుగు శాఖా గ్రంథాలయానికి బదిలీపై వచ్చారు. జమ్మలమడుగు ప్రభుత్వ గ్రంథాలయంలో అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు బండారు శ్రీనివాసులు, గడియారం సాహితీపీఠం అధ్యక్షుడు డాక్టర్ ఎంఎల్‌నారాయణరెడ్డి వారిని ఘనంగా సత్కరించారు. గ్రంథాలయ అభివృద్ధి కమిటీ శివగణపతి, డాక్టర్ నరసింహులు, అమీర్, దాదాఖలందర్, క్రిష్ణయ్య, భాస్కర్, లక్ష్మినారాయణ, వెంకటేశ్వరరెడ్డి, రామయ్య ఉన్నారు.

ప్రజా చైతన్యంతోనే రాక్షస పాలన అంతం


మాట్లాడుతున్న మాదాసు మురళి

ప్రొద్దుటూరు టౌన్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): ప్రజల చైతన్యంతోనే రాష్ట్రంలో రాక్షస, అరాచక పాలన అంతమైందని జనసేన పార్టీ నాయకుడు మాదాసు మురళి పేర్కొన్నారు. టీడీపీ కూటమి ప్రభుత్వం ఏర్పాటై ఏడాది కావస్తున్న సందర్భంగా మంగళవారం జనసేన పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైసీపీ రాక్షసపాలన అంతమై సంవత్సరం కావస్తోందని పేర్కొన్నారు. కూటమి పార్టీ పాలనలో రాష్ట్రప్రజలు దీపావళి, సంక్రాంతి పండుగలను ఒకేసారి జరుపుకున్నట్లుగా ఉందన్నారు. కూటమి పాలనకు ఏడాది పూర్తయిన సందర్భంగా జనసేన వీర మహిళలు సంక్రాంతి పండుగ రోజు ఇళ్ల ముందు ముగ్గులు వేసుకున్నట్లుగా ముగ్గులతో అలంకరించుకుని సాయంత్రం దీపావళి టపాసులు కాల్చుకున్నట్లుగా సంతోషంగా టపాసులు కాల్చాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జనసేన సైనికులు రామయ్య రాయల్, సంజీవ, హరీష్‌కుమార్, రమణ, చంద్ర, కేశవ పాల్గొన్నారు.